
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
గురువారం 13 నవంబరు 2025





ఇష్టారాజ్యమే!

గ్రామ, వార్డు సచివాలయాల తీరుపై విమర్శలు

సరైన పర్యవేక్షణ వ్యవస్థ లేకుండా నాడు ఏర్పాటు

గ్రామ, వార్డు సచివాలయాల తీరుపై అనేక విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సరైన పర్యవేక్షణ వ్యవస్థ లేకపోవడంతో ఉద్యోగులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీనికి తోడు వివిధశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తమ కార్యాలయాల్లో వీరిని డెప్యుటేషన్‌పై పని చేయించుకుంటున్నారు. దీంతో సచివాలయాలకు పనులపై వచ్చిన ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండటంలేదు. ఇబ్బంది ఉన్న చోట్ల నెలల తరబడి కంప్యూటర్లు పనిచేయక పోవడంతో సేవలు నిలిచిపోతున్నాయి. కూటమి ప్రభుత్వం సచివాలయాలను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తేనే మెరుగైన సేవలు అందుతాయని ప్రజలు భావిస్తున్నారు. 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో అనేక విషయాలు వెలుగుచూశాయి.

- నేటికీ అదేవిధంగా కొనసాగుతున్న పాలన
- డెప్యుటేషన్‌పై వివిధ శాఖలకు ఉద్యోగులు
- సచివాలయాల్లో అందుబాటులో ఉండని సిబ్బంది
- నెలల తరబడి పనిచేయని కంప్యూటర్లు
- పూర్తిస్థాయిలో సచివాలయాల ప్రక్షాళన అవసరం
- ఆంధ్రజ్యోతి పరిశీలనలో అనేక విషయాలు వెలుగులోకి..

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పాలనగాడితప్పింది. ఉద్యోగులపై పర్యవేక్షణ చేసేందుకు సరైన వ్యవస్థ లేకపోవడంతో అన్ని విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు సచివాలయ సిబ్బందిని తమ కార్యాలయాల్లో పనిచేసేందుకు డెప్యుటేషన్ పేరుతో వాడుకుంటున్నారు. కలెక్టరేట్‌తో పాటు డీపీవో, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, వ్యవసాయ తదితర శాఖల అధికారులు సచివాలయ సిబ్బందితో తమ కార్యాలయాల్లో పనిచేయించుకుంటున్నారు. దీంతో గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రజలకు సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. మరోవైపు సచివాలయాల్లో కంప్యూటర్‌లు మొరాయిస్తున్నాయి. వీటికి కనీస మరమ్మతులు చేయడానికి నెలలు పడుతోంది. పర్యవేక్షించే వారు లేకపోవడంతో మిగతా 6లో..



మూడంచెలుగా సచివాలయాల్లో సిబ్బంది

ఇటీవల కాలంలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పరిపాలన సౌలభ్యం కోసం కొన్ని మార్పులు చేశారు. 2,500 మంది జనాభా ఉన్న గ్రామ సచివాలయాన్ని ఎ కేటగిరిగా చూపి అక్కడ ఆరుగురు సిబ్బందిని, అదే వార్డు సచివాలయంలో అయితే ఐదుగురు సిబ్బందితో పని చేయించాలని నిర్ణయించారు. 2,500 నుంచి మూడు వేల మంది జనాభా ఉన్న గ్రామ సచివాలయంలో ఏడుగురు సిబ్బంది, వార్డు సచివాలయంలో అయితే ఆరుగురు ఉండాలని పేర్కొన్నారు. 3,500లకుపైబడి జనాభా ఉన్న గ్రామ సచివాలయంలో ఎనిమిది మంది, వార్డు సచివాలయంలో అయితే ఏడుగురితో పనిచేయించాలని నిర్ణయించారు. సచివాలయాల్లో అడ్మిన్‌తో పాటు డేటా ప్రాసెస్ అసిస్టెంట్, మహిళా పోలీస్, వెల్ఫేర్ సెక్రటరీలు ఖచ్చితంగా ఉండాలని నిర్ణయించారు. ఆయా గ్రామాల్లో ఉన్న పరిస్థితులను బట్టి వ్యవసాయశాఖ అసిస్టెంట్, మత్స్యవిభాగం, ఉద్యాన అసిస్టెంట్‌లను కూడా అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు.

నూతన వ్యవస్థ అందుబాటులోకి వస్తేనే..

గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందిని ఆయా సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచకుండా ఆయా విభాగాల అధికారులు తమ కార్యాలయాల్లో పని చేయించుకోవడంతో రాష్ట్ర సచివాలయ విభాగం అధికారులు ఇటీవల కొత్త ప్రతిపాదన చేశారు. సచివాలయంలోని అన్ని విభాగాల్లో పనిచేసే సిబ్బందిపై పర్యవేక్షణ చేసేందుకు జిల్లాస్థాయిలో ఒక అధికారిని నియమించి, ఆయనకు మరో ఆరుగురు సిబ్బందిని ఇచ్చి ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో పాటు మండల స్థాయిలో ఎంపీడీవోలు, పురపాలక సంఘాల్లో కమిషనర్‌లతో సమన్వయం చేసుకునేలా ఒక అధికారితో పాటు ఇద్దరు, ముగ్గురు సిబ్బందిని నియమించాలని ప్రతిపాదన చేశారు. ఈ వ్యవస్థ ఏర్పడితే సచివాలయ సిబ్బందికి సంబంధించిన పర్యవేక్షణ మొత్తం ఈ ప్రత్యేక అధికారులు చూడాల్సి ఉంటుంది. దీంతో పాటు సచివాలయ సిబ్బంది తమకు కేటాయించిన సచివాలయం నుంచి తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరు వేయాలనే నిబంధనను పాటించేలా చేస్తేనే సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటారని అధికారులు అంటున్నారు.

పట్టణాభిషేకం చేయాలి

ఆ నాలుగు మేజర్ గ్రామ పంచాయతీలకు హోదా ఇవ్వాలి

- అవనిగడ్డ, మైలవరం, పామర్రు, విస్సన్నపేట శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు
- వ్యవసాయేతర జనాభా.. వార్షికాదాయం పెరుగుదల
- సీఆర్‌డీఏ పరిధిలో ఉండటం కూడా కలిసొచ్చే అంశం
- ఉమ్మడి కృష్ణాలో అమరావతి అభివృద్ధికి దోహదం
- గ్రేటర్‌కు అడుగులు పడుతున్న వేళ తెరపైకి పట్టణీకరణ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గ్రేటర్ విజయవాడకు అడుగులు పడుతున్న వేళ ఉమ్మడి కృష్ణాజిల్లాలోని మరో నాలుగు మేజర్ గ్రామ పంచాయతీలను నగర పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఏర్పడింది. అవి అవనిగడ్డ, మైలవరం, పామర్రు, విస్సన్నపేట. వ్యవసాయేతర జనాభా ఎక్కువ కలిగి ఉండటమే ఇందుకు కారణం. ఇక్కడ పట్టణస్థాయికి అనుగుణంగా జనాభా పెరుగుతోంది. వ్యాపార కార్యకలాపాలు సాగుతున్నాయి. అపార్ట్‌మెంట్లు, లే అవుట్ల కారణంగా రియల్ ఎస్టేట్ ఊపందుకుంది. ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలు, ఆసుపత్రులు స్థాపిస్తున్నారు. పారిశ్రామికంగానూ అడుగులు పడుతున్నాయి. అనేక గ్రామాలకు ఇవి మార్కెటింగ్ ప్రాంతాలుగా ఉన్నాయి. ఈ నాలుగూ రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) పరిధిలోనివి. నగర పంచాయతీలుగా అభివృద్ధి చేయటం వల్ల ఈ ప్రాంతాల్లో అభివృద్ధి శరవేగంగా జరిగే అవకాశం ఉంటుంది. మాస్టర్ ప్లాన్ పరిధిలోనే ఉన్నాయి. వీటికి పట్టణ హోదా కల్పించడం వల్ల విశాలమైన రాజధాని రూపాంతరం చెందుతుంది.

గ్రామాలు.. వాటి పురోభివృద్ధి

అవనిగడ్డ : కృష్ణాజిల్లాలోని అవనిగడ్డ ప్రాంతం మండల కేంద్రం. మచిలీపట్నానికి 57 కిలోమీటర్లు, గుంటూరు జిల్లాలోని రేపల్లె పట్టణానికి కేవలం ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది. 28 వేల మంది జనాభా. అవనిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలో వ్యవసాయేతర (నాన్ అగ్రికల్చరల్ పాపులేషన్) జనాభా 48.44 శాతం. రానున్న రోజుల్లో ఇది మరింత పెరిగి అవకాశం ఉంది. కాబట్టి మిగతా 6లో..



అట్టహాసంగా గృహ ప్రవేశాలు

ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన అర్బన్ 1.0 కింద మచిలీపట్నంలో నిర్మించిన ఇళ్లను కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ బుధవారం ప్రారంభించారు. పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. 8



కన్నోళ్లు దూరమై.. బతుకు భారమై!

- గమ్యమెటో తెలియక ఊరు వదిలి విజయవాడ చేరిన యువతి
- ఆటో డ్రైవర్లతో తన బాధను పంచుకున్న అభాగ్యురాలు
- ఆమె కన్నీటి గాథ విని చలించిపోయిన ఆటో అన్నలు
- కృష్ణలంక పోలీసుల సాయంతో వాసవ్య సంరక్షణ కేంద్రానికి తరలింపు

8

ఆయన ఓ క్లాస్1 కాంట్రాక్టర్. జలవనరుల శాఖ పిలిచిన టెండర్ల ప్రక్రియలో పాల్గొంటాడు. టెండర్‌ను దక్కించుకుని పని పూర్తిచేస్తాడు. ఆ పనికి భాగాలుగా బిల్లులు చేయించుకుంటాడు. కొన్ని నెలల తర్వాత ఇంకా కొంత పని మిగిలిందని రివైజ్డ్ ఎస్టిమేట్స్ రూపొందించుకుని ప్రతిపాదనలు చేస్తాడు. వాటికి అధికారులు ఎలాంటి అడ్డంకులు చెప్పకుండా ఆమోదించాలి. ఒకవేళ ఏదైనా వివరణ కోరితే.. వారి అంతు చూసేస్తాడు. బదిలీ చేయిస్తానని బెదిరిస్తాడు. అధికారులపై ఇష్టానుసారంగా నోరుపారేసుకుంటాడు. ఇవీ జలవనరుల శాఖ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ 'బుసబుసలు'. ఆయన తీరుపై గుర్రుగా ఉన్న ఇంజనీర్లు సామూహికంగా సెలవులోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

కాంట్రాక్టర్ బుసబుసలు



జలవనరుల శాఖను వదలని జలగ

- కేడీఎస్ పనుల్లో సార్ చెప్పిందే వేదం
- ఆమోదించని అధికారులకు బెదిరింపులు
- రివైజ్డ్ ఎస్టిమేషన్స్ పేరిట దోపిడీ
- గతంలో మాజీ మంత్రి జోగి రమేశ్‌తో చెట్టాపెట్టాల్
- నేడు కూటమి ప్రజాప్రతినిధి వద్దకు జంప్
- కాంట్రాక్టర్ తీరుతో విసిగిపోయిన ఇంజనీర్లు
- అధికారులు సామూహికంగా సెలవు పెట్టే యోచన

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఉమ్మడి కృష్ణాజిల్లాలో క్లాస్1 కాంట్రాక్టర్‌గా పేరున్న వ్యక్తి గుడివాడ కేంద్రంగా చక్రం తిప్పాడు. వైసీపీ హయాంలో నాటి మంత్రి జోగి రమేశ్‌తో చెట్టాపట్టాలేసుకుని తిరిగాడు. ఆయన అండతో జలవనరుల శాఖలోని కృష్ణా డెల్టా సిస్టమ్ (కేడీఎస్)లో ఇష్టానుసారంగా వ్యవహరించాడు. ఏ కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించినా, చెల్లించకపోయినా ఈ క్లాస్1 కాంట్రాక్టర్‌కు మాత్రం అధికారులు బిల్లులు చెల్లించేవారు. ఈ కాంట్రాక్టర్ ఎక్కువగా డ్రెడ్జింగ్ పనులు చేస్తుంటాడు. మేజర్ డ్రెయిన్లలో పూడికతీల పనులకు టెండర్లను దక్కించుకుని పనులు పూర్తిచేస్తాడు. చేసిన పనులకు భాగాలుగా బిల్లులు చేయించుకుంటాడు. కొన్నినెలల తర్వాత నిర్ణయించిన కొలతల కంటే ఎక్కువ పనిచేశానని, దానికి అంచనాలను సవరించాలని ప్రతిపాదనలు తయారు చేస్తాడు. ఇలా ఆ కాంట్రాక్టర్ ఇచ్చిన రివైజ్ ఎస్టిమేట్స్ (ఆర్‌ఈ)ను వైసీపీ పాలనలో జలవనరుల శాఖలో అధికారులు ఆమోదించారు. ఆ పనులకు సంబంధించిన బిల్లులను చకచకా మిగతా 6లో..

ఆర్‌ఈల అసలు గుట్టు ఇదీ

టెండర్లు దక్కించుకున్న పనులు పూర్తిచేయడం, చేసిన పనికి భాగాలుగా బిల్లులు తీసుకోవడం, తర్వాత అంచనాలను సవరించడం ఈ కాంట్రాక్టర్‌కు అలవాటు. దీని వెనుక భారీ స్కెచ్ ఉంది. డ్రెయిన్లలో పూడికతీత ఎన్ని క్యూబిక్ మీటర్లు తీయాలన్న విషయాన్ని టెండర్ ప్రకటనలో పేర్కొంటారు. టెండరు దక్కించుకున్నాక నిర్ణయించిన కొలతల కంటే ఎక్కువ పనిచేశానని చూపించుకుంటాడు. ఎన్ని క్యూబిక్ మీటర్లు అదనంగా పనిచేశారో దానికి రివైజ్డ్ అంచనాలు రూపొందిస్తాడు. దానికి ప్రత్యేకంగా బిల్లును చేయించుకుంటాడు. జలవనరుల శాఖలో ఈ కాంట్రాక్టర్ చేసిన ప్రతి పనికీ ఆర్‌ఈలు రావడం ఒక సంస్కృతిగా మారిందని ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.

గంజాయి టిప్పర్లు

- టిప్పర్లలో గంజాయి స్మగ్లింగ్
- రూ.1.20 కోట్ల విలువైన గంజాయి, టిప్పర్లు స్వాధీనం

గంజాయితో వ్యాపారం చేసి భారీగా ఆదాయాన్ని పొందుతున్న స్మగ్లర్లు ట్రెండ్ మార్చారు. ఇప్పటి వరకు కూరగాయల లారీలు, వ్యాన్లు, గూడ్స్ వాహనాలను గంజాయి సరఫరాకు ఉపయోగించిన వారు ఇప్పుడు టిప్పర్లను ఎంచుకుంటున్నారు. తాజాగా ఈగల్ బృందాలు చేసిన దాడుల్లో స్మగ్లర్ల కొత్తకోణం బయటపడింది. 6

యమలోకానికి దారి!

- గోతులమయంగా యనమలకుదురు-అవనిగడ్డ రోడ్డు
- ఓవైపు పంటచేలు.. మరోవైపు కాల్వగట్టు

జెడ్పీ కన్వెన్షన్ రచ్చ!

ప్రజాప్రతినిధి కనుసన్నల్లోనే నిర్వహణ • అద్దెల వ్యవహారంలో అనేక అక్రమాలు!

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ప్రజాధనంతో నిర్మించిన జెడ్పీ కన్వెన్షన్‌హాలు ఇప్పటికే ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయింది. అద్దె రూపంలో వచ్చే ఆదాయం జెడ్పీకి సక్రమంగా జమ చేయాల్సి ఉన్నా అధికశాతం నగదు పక్కదారి పడుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా జెడ్పీ కన్వెన్షన్‌హాలు సీలింగ్‌కు చెదలు పట్టిందని లక్షలాది రూపాయలతో మరమ్మతులు చేయాలనే ప్రతిపాదన పెట్టారు. మరమ్మతులు పూర్తయ్యేవరకు ఈ హాలును మూసివేస్తున్నట్లు ప్రకటించారు. ఈ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

- అడ్డుకునేందుకు కూటమి ప్రజాప్రతినిధుల ప్రయత్నం
- తాజాగా మరమ్మతుల పేరుతో మూసివేత
- నిధుల విడుదలకు అధికారుల విముఖత

ప్రజాప్రతినిధి మనుషులతోనే నిర్వహణ

2014-2019 మధ్యకాలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి జెడ్పీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ సూచనలతో జెడ్పీ కన్వెన్షన్ హాలును ఆధునిక హంగులతో జెడ్పీ ప్రాంగణంతో నిర్మించారు. జెడ్పీ, మండల పరిషత్, పంచాయతీలకు వచ్చిన నిధులు సకాలంలో పనులు చేయని కారణంగా వెనక్కి వెళ్లిపోయేస్థితిలో ఆ నిధులను దీనికి మళ్లించారు. 2024, మేలో ఈ కన్వెన్షన్ హాలును ప్రారంభించే సమయంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఈ హాలును వైసీపీ నాయకులు గలాటా సృష్టించి, ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని పగలకొట్టి, తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం తమ మనుషుల ద్వారా నడుపుతూ వచ్చారు. ఈ అంశం వివాదాస్పదం కావడంతో కొంత కాలం తర్వాత జెడ్పీలోని సిబ్బందికి ఈ కన్వెన్షన్‌హాలు నిర్వహణను అప్పగించారు. ఆ తర్వాత జెడ్పీ కన్వెన్షన్‌హాలు నుంచి ఆదాయం రాకపోవడంతో సంబంధిత ఉద్యోగులను ఈ బాధ్యతల నుంచి తప్పించారు. జెడ్పీలో ప్రజాప్రతినిధి తరఫున కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ కన్వెన్షన్‌హాలు మిగతా 6లో..


మూతపడిన జెడ్పీ కన్వెన్షన్‌హాలు

రాజ్యాంగ సవరణ సంయుక్త కమిటీలో ఎంపీ బాలశౌరికి చోటు



మచిలీపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ సవరణ 130వ బిల్లు, 2025 జమ్ముకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ బిల్లు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాల సవరణ బిల్లుల సంయుక్త కమిటీలో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరిని సభ్యుడిగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రతిష్ఠాత్మకమైన ఈ కమిటీలో తనను సభ్యుడిగా నియమించిన ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖామంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు ఎంపీ బాలశౌరి బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలియజేశారు.

యమలోకానికి దారి!

» అడుగడుగునా అవరోధాలు..!
» గోతులమయంగా యనమలకుదురు-అవనిగడ్డ రోడ్డు
» ఓవైపు పంటచేలు.. మరోవైపు కాల్వగట్టు
» భారీ వాహనాల రాకపోకలతో కుంగిపోతున్న రహదారి
» ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందోనని భయాదోళన

ఉమ్మడి కృష్ణాజిల్లాలో అవనిగడ్డకు ప్రత్యేక స్థానం ఉంది. డీఎస్సీకి ఎంపికైన ఉపాధ్యాయుల్లో అధిక శాతం మంది ఇక్కడ శిక్షణ పొందిన వారే. ఇక్కడి కోచింగ్ సెంటర్ల కారణంగా ఈ ప్రాంతానికి మంచిపేరు ఉంది. అటువంటిది అవనిగడ్డకువెళ్లాలంటే మాత్రం అడుగడుగునా అవరోధాలే. ఏదైనా వాహనంపై విజయవాడ నుంచి అవనిగడ్డకు వెళ్లాలంటే 50 కిలోమీటర్లు పైగానే ప్రయాణించి సుమారు పదిగ్రామాలను దాటుకుని రావాలి. దారిపొడవునా ఎప్పుడు ప్రమాదం ఏ రూపంలో ముంచుకొస్తుందో తెలియదు. ఎందుకంటే నగరం నుంచి అవనిగడ్డకు వెళ్లే రోడ్డు మొత్తం కట్టరోడ్డు కావడం, ఒక వైపు పంటకాలువ, మరోవైపు పంటపొలాలు రోడ్డుకు కనీసం పది అడుగుల దిగువన ఉంటాయి. దీనివలన రోడ్డు ఇరువైపులా కుంగిపోయింది. పెద్దపెద్ద గోతులతో నిండి ఉండటంతో ఎటునుంచి వెళ్లాలో అర్థం కాని పరిస్థితి. రాత్రి సమయంలో ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే భయపడాల్సిన వస్తోందని స్థానికులు చెబుతున్నారు.







ప్రమాదకరంగా యనలమలకుదురు - అవనిగడ్డ రహదారి



(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

యనలమలకుదురు నుంచి అవనిగడ్డకు వెళ్లాలంటే సుమారు 50 కిలోమీటర్లు ప్రయాణించాలి. ఈ దారిలో సుమారు 30 కిలోమీటర్ల పైగానే రోడ్డు అస్తవ్యస్తంగా తయారైంది. భారీ వాహనాల రద్దీ కారణంగా పెద్దపెద్ద గుంతలు, పగుళ్లతో రోడ్డంతా ఛిద్రమైంది. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు రోడ్డు ఇరువైపులా కుంగిపోవడంతో భారీ వాహనాలు ఎదురెదురుగా వస్తే భయానక వాతావరణమే.. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణంచాలిందే. కొన్ని చోట్ల వందల మీటర్ల మేర రోడ్డు మొత్తం పగుళ్ల, గోతులతో ఉండటంతో సమయం వృథాతో పాటు ఒళ్లు నొప్పులు వస్తున్నాయని వాహనదారులు చెబుతున్నారు. సుమారు 13 సంవత్సరాల క్రితం వేసిన రోడ్డుకు అప్పుడప్పుడు చిన్నపాటి మరమ్మతులు చేయడం తప్ప రోడ్డును పట్టించుకునే వారే లేరని స్థానికులు వాపోతున్నారు. ఈ రోడ్డు పరిస్థితే ఇలా ఉంటే శివారు గ్రామాల రోడ్ల దుస్థితి చెప్పనవసరం లేదని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ప్రయాణం మరింత భయంగా ఉంటుందని ఈ రోడ్డును ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు వేయిస్తే బాగుంటుందని యనమలకుదురు నుంచి అవనిగడ్డ మధ్య గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

యనమలకుదురు నుంచి అవనిగడ్డకు వెళ్లాలంటే మధ్యలో మద్దూరు, రొయ్యూరు, వల్లూరుపాలెం, తొట్లవల్లూరు, చాగంటిపాదం, కళ్లంవారిపాలెం, పాములవారిపాలెం, మధురాపురం, ఐనాపురం, శ్రీకాకుళం, నడికుదురు, కోకిలగడ్డ, పులిగడ్డను దాటుకుంటూ వెళ్లాలి. అయితే రోడ్డు ప్రారంభం యనమలకుదురులోనే నరకానికి ద్వారం తెరిచినట్టు గోతులు ఇక్కడి నుంచే మొదలవుతాయి. మధ్యలో అక్కడక్కడా రోడ్డు పరవాలేదనిపించినా మద్దూరు దాటగానే రోడ్డు విడిపోయినట్టు ఇరువైపులా కుంగిపోయి ఉంటుంది. మద్దూరు నుంచి తొట్లవల్లూరు వరకు ప్రయాణం నరకమే. తొట్లవల్లూరు నుంచి మూడు కిలోమీటర్ల మేర రోడ్డు బాగానే ఉన్నా తర్వాత వాహనాలు పరిగెత్తడం మాని నడవాల్సిందే.

గతంలో సర్పంచ్ మరమ్మతులు చేయించారు



- చంటయ్య, మద్దూరు

రోడ్డు వేసి సుమారు 13 ఏళ్ల పైనే అయింది. ఇప్పటి వరకు మూడు నాలుగు ప్రభుత్వాలు మారాయి. కానీ ఎవరూ రోడ్డు నిర్మాణం చేపట్టలేదు. ఎన్నికల ముందు తూతూమంత్రంగా మరమ్మతులు చేస్తారు. లేదంటే పట్టించుకోరు. రోడ్డు అధ్వాన్న పరిస్థితిని చూడలేక గతంలో గ్రామ సర్పంచ్ సొంత డబ్బుతో రోడ్డు మరమ్మతులు చేయించారు. మరో ముఖ్యమైన విషయం ఈ రోడ్డులో చీకటి పడితే ప్రయాణం నరకమే. రోజూ అనేకమంది పడిపోతున్నారు. రోడ్డు వేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను అడిగి నీరసించిపోయాం. రోడ్డుకు మోక్షం ఎప్పుడు వస్తుందో..



సింగన్నగూడెంలో మినుముపంట నమోదు పరిశీలిస్తున్న ఏవో రంగనాథ్‌బాబు

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పంట నష్టపోయిన రైతుల వివరాలు నమోదు చేయడం జరిగిందని, అర్హులైన వారికి ప్రభుత్వం నష్టపరిహారం అందిస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి రంగనాథ్‌బాబు తెలిపారు. 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'మినుము-వెలవెల' కథనానికి బుధవారం ఆయన సమాధానమిస్తూ క్షేత్రస్థాయి పరిశీలన చేయడం పూర్తయిందని వరి, మినుము పంట నష్టం వివరాలతో కూడిన నివేదిక ఉన్నతాధికారులకు అందించామని వివరించారు. వివిధ గ్రామాల్లో ఆర్బీకేల్లో నమోదు చేసుకున్న రైతులు వివరాల ఆధారంగా బాపులపాడు మండల వ్యాప్తంగా 2779మంది రైతులకు చెందిన 3625ఎకరాల్లోని వరిపంట, 716 మంది రైతులకు చెందిన 1000ఎకరాల మినుముపంట నష్టపోయినట్టు 4న ఉన్నతాధికారులకు అందజేయడం జరిగిందన్నారు. వివరాల ఆధారంగా నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమ చేయబడతాయన్నారు.

గంజాయి టిప్పర్లు!

» టిప్పర్లలో గంజాయి స్మగ్లింగ్
» అడుగుభాగాన ప్రత్యేక అరల్లో తరలింపు
» కొత్త ఆటోనగర్‌లోని గోడౌన్‌లో టిప్పర్ల తయారీ
» ఒడిసా నుంచి కానూరు వరకు సరుకు రాక
» కానూరు నుంచి కంటైనర్లలో ఇతర రాష్ట్రాలకు..
» స్మగ్లింగ్ కింగ్‌పిన్‌గా ఇంజనీరింగ్ పట్టభద్రుడు
» యనమలకుదురులో ఉంటూ వ్యవహారాలు
» రూ.1.20 కోటి విలువైన గంజాయి, టిప్పర్లు స్వాధీనం

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : అవనిగడ్డకు చెందిన సాయన రాహుల్‌కుమార్ ఇంజనీరింగ్ పూర్తిచేశాడు. ప్రస్తుతం యనమలకుదురులో నివసిస్తున్నాడు. రెండేళ్ల కిందట కానూరులోని కొత్త ఆటోనగర్‌లో ఓ గోడౌన్ అద్దెకు తీసుకున్నాడు. మూడు టిప్పర్లను, రెండు పెద్ద కంటైనర్లను కొన్నాడు. వాటిని ఆటోనగర్‌లోని గోడౌన్‌లో భద్రపరిచాడు. ఆటోనగర్‌కు చెందిన మహ్మద్ హఫీక్‌ను గోడౌన్ మేనేజర్‌గా నియమించుకున్నాడు. లారీల బాడీబిల్డింగ్‌లో నైపుణ్యం ఉన్న అతడితో టిప్పర్లు, కంటైనర్ల బాడీలకు అడుగుభాగాన అరలను తయారు చేయించాడు. ఆ అరలు పైకి కనిపించకుండా రేకులను మూతలుగా అమర్చాడు. వైజాగ్‌కు చెందిన ఆనంద్‌కుమార్ పేరున రెండు లారీలు రిజిస్ట్రేషన్ చేయించాడు. హర్యానాకు చెందిన సోహన్‌లాల్, వైజాగ్‌కు చెందిన అబ్దుల్ హసన్‌ను డ్రైవర్లుగా పెట్టుకున్నాడు. ఐదు భారీ వాహనాల్లో మూడింటిని రాహుల్ తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈ మూడు ఉత్తరప్రదేశ్ రిజిస్ట్రేషన్‌తో ఉన్నాయి. ఏపీ రిజిస్ట్రేషన్‌తో ఉన్న టిప్పర్లను ఒడిసాలోని భవానీపట్నం ప్రాంతానికి పంపుతాడు. అక్కడ దీపు అనే వ్యక్తి నుంచి భారీగా గంజాయిని కొంటాడు. సరుకును టిప్పర్ల బాడీ అడుగు భాగాన ఉన్న అరల్లో పెట్టిన తర్వాత, అందులో బేబీ చిప్స్ కంకర, గ్రావెల్ లోడ్ వేస్తారు. వాటిని ఆనంద్‌కుమార్, సోహన్‌లాల్, అబ్దుల్ హసన్ తీసుకొచ్చి ఆటోనగర్‌లో ఓ పక్కన ఆపుతారు. తర్వాత మహ్మద్ హఫీక్ వెళ్లి వాటిని గోడౌన్‌లోకి తీసుకొస్తాడు. తర్వాత రాత్రి సమయంలో టిప్పర్లను ఖాళీ చేసి గంజాయిని యూపీ రిజిస్ట్రేషన్‌తో ఉన్న కంటైనర్లలో ఉన్న అరల్లో లోడ్ చేస్తారు. ఈ ఖాళీ కంటైనర్లతో యూపీ, పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాలకు సరుకును అందజేస్తారు. యూపీలోని ఝాన్సీలో గల ముఖేష్ అనే వ్యక్తికి అందజేయడానికి 249 కిలోల పుల్వానా రకం గంజాయిని లోడ్ చేసి వాహనాలను సిద్ధం చేశారు. దీనిపై సమాచారం అందుకున్న ఈగల్ బృందాలు దాడిచేసి రూ.1.20 కోట్ల విలువైన గంజాయితో పాటు వాహనాలను సీజ్ చేశాయి. భారీ మొత్తంలో గ్రేడ్1 గంజాయి, అంతర్రాష్ట్ర లింకులు ఉండటంతో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు రంగంలోకి దిగారు.

ట్రిప్‌నకు రూ.40 వేలు

ఒడిసాలోని భవానీపట్నం నుంచి సరుకును తీసుకొచ్చినందుకు ఒక్కో డ్రైవర్‌కు ట్రిప్‌నకు రూ.40 వేల చొప్పున రాహుల్ ఇస్తున్నాడు. పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండేళ్ల నుంచి ఈ గంజాయి గోడౌన్ నడుస్తోంది. ఈగల్, డీఆర్ఐ బృందాలు చేరుకుని సోదాలు చేసే వరకు ఇక్కడ ఏం జరుగుతుందో పెనమలూరు పోలీసులకు తెలియకపోవడం గమనార్హం.

అలవాటు లేని ఆదాయం

సాధారణంగా గంజాయి తాగడం అలవాటు పడినవారు, అది లేకపోతే జీవితం లేదనుకునే వారు దాన్ని కొనడం, విక్రయించడం చేస్తుంటారు. ఇప్పటి వరకు వెలుగులోకి వచ్చిన కేసుల్లో ఇదే జరిగింది. ఈగల్, డీఆర్ఐ అధికారులు వెలుగులోకి తీసుకొచ్చిన ఈ కేసులో మాత్రం విచిత్రం కనిపిస్తోంది. ఇంజనీరింగ్ పూర్తిచేసిన రాహుల్ కుమార్‌కు ఎలాంటి వ్యసనాలు లేవు. అతడు సిగరెట్ తాగడు. గంజాయి జోలికి వెళ్లడు. మద్యం ముట్టడు. ఏ అలవాటు లేకపోయినా కేవలం డబ్బు కోసం గంజాయిని సరఫరా చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు.

బస్సులో నగదు బ్యాగ్ భద్రం

» బ్యాగ్‌లో 6లక్షల నగదు, విలువైన పత్రాలు
» బస్సులో వదిలేసి దిగిపోయిన వ్యాపారి
» పోలీస్ స్టేషన్‌లో అప్పగించిన మరో ప్రయాణికుడు

బస్‌స్టేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం నుంచి ఆర్టీసీ బస్సులో విజయవాడ వచ్చిన వ్యక్తి రూ.6లక్షల నగదు, విలువైన పత్రాలు ఉన్న బ్యాగ్‌ను మర్చిపోయి బస్సు దిగి వెళ్లిపోయాడు. బ్యాగ్‌ను గమనించిన మరో ప్రయాణికుడు తెరిచి చూడగా.. పెద్దమొత్తంలో నగదు కట్టలు, పలు ముఖ్యమైన పత్రాలు ఉండటంతో విషయాన్ని బస్సు డ్రైవర్‌కు చెప్పాడు. డ్రైవర్ సూచన మేరకు బ్యాగ్‌ను కృష్ణలంక పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన బుధవారం విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..



ఎస్ఐ సమక్షంలో బాధితుడికి నగదు, పలు పత్రాలు అప్పగిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రీనివాసరావు (తెల్లచొక్కా వ్యక్తి)

విశాఖ జిల్లా మధురవాడ మండలం, పోతిన మల్లయ్యపాలెం (పిఎన్‌పాలెం)కు చెందిన మాదంశెట్టి సునీల్ కుమార్ స్థానికంగా రియల్ ఎస్టేట్ వ్యాపారంతో పాటు కేటరింగ్ పనులు చేస్తుంటాడు. ఇతను విజయవాడలో వ్యక్తిగత పనుల నిమిత్తం సోమవారం రాత్రి 6లక్షల నగదు, పలు ముఖ్య పత్రాల బ్యాగ్‌తో పాటు మరో బ్యాగ్‌తో విజయవాడ బస్సు ఎక్కాడు. బస్సు విజయవాడ బస్‌స్టేషన్‌కు వచ్చిన తరువాత సునీల్ కుమార్ బస్సు దిగుతూ నగదు, పత్రాలు ఉన్న బ్యాగ్‌ను మరచిపోయి వెళ్లిపోయాడు. అదే బస్సులో వచ్చిన విజయవాడ మాచవరానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి శ్రీనివాసరావు సీటులో బ్యాగ్ గమనించి తెరచి చూశాడు. అందులో నగదు కట్టలు, పలు ముఖ్య పత్రాలు ఉండటం గమనించి బస్సు డ్రైవర్‌కు చెప్పాడు. డ్రైవర్ సూచన మేరకు శ్రీనివాసరావు నగదు బ్యాగ్‌ను తీసుకుని నేరుగా కృష్ణలంక స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు జరిగిన విషయాన్ని చెప్పాడు. ఈలోగా బాధితుడు సునీల్ కుమార్ స్టేషన్‌కు వచ్చి తన నగదు, పత్రాలు బ్యాగ్‌ను బస్సులో మర్చిపోయానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఆదేశాలమేరకు ఎస్ఐ భాను ప్రసాద్ సమక్షంలో బాధితుడికి రూ.6లక్షల నగదు, పత్రాలు ఉన్న బ్యాగ్‌ను అందజేశారు.

మీ డబ్బు-మీ హక్కు ప్రత్యేక శిబిరం రేపు

» జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రియాంక

కలెక్టరేట్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : 'మీ డబ్బు-మీ హక్కు' నినాదంతో భారత ప్రభుత్వం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ ఏడాది అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా కలెక్టర్ లక్ష్మీశ మార్గనిర్దేశనం మేరకు ఈనెల 14న కలెక్టరేట్‌లో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్టు జిల్లా ఎల్డీఎం కె.ప్రియాంక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'మీ డబ్బు-మీ హక్కు' కార్యక్రమం ద్వారా పదేళ్లు, అంతకు మించి లావాదేవీలు జరగని బ్యాంకు ఖాతాల్లోని సొమ్మును బ్యాంకులు అర్హులకు తిరిగి ఇచ్చేయడం జరుగుతుందన్నారు. ఖాతాదారుల మరణం, చిరునామా మార్పు లేదా నామిని వివరాల్లో లోపాలు, మరచిపోవడం వంటి కారణాలతో కొన్ని ఖాతాల్లోని డబ్బు లబ్ధిదారులకు చేరడం లేదన్నారు. ఇలా ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 5,50,778 బ్యాంకు ఖాతాల్లో రూ.145.47కోట్లు ఉన్నట్టు వివరించారు. వీటికి సంబంధించిన వ్యక్తులు, సంస్థల ప్రతినిధులు సరైన ధృవపత్రాలతో ఈకేవైసీ పూర్తి చేసి తమ సొమ్మును తిరిగి పొందవచ్చన్నారు. ఇటీవల కలెక్టరేట్‌లో జరిగిన డీసీసీ-డీఎల్ఆర్సీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ, యూబీఐ రీజనల్ హెడ్ ఎంవీ తిలక్, ఆర్బీఐ అధికారి నవీన్ తదితరులతో 'మీ డబ్బు-మీ హక్కు' ప్రత్యేక కార్యక్రమంపై చర్చించి, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, వివిధ బ్యాంకుల అధికారులతో కలిసి ప్రచార కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించడం జరిగిందని ప్రియాంక తెలిపారు.

ఒక శనివారం చాలు..

» వంశీ బెయిల్ షరతుల్లో సడలింపు

విజయవాడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : ముదునూరి సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో నిందితుడిగా ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్‌కు బెయిల్ షరతులను సడలిస్తూ ఏసీబీ కోర్టు బుధవారం ఆదేశాలు ఇచ్చింది. బెయిల్ మంజూరు చేసే సమయంలో ప్రతి రెండో, నాలుగో శనివారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకాలు చేయాలని షరతు విధించింది. వాటిని సడలించాలని ఆయన కొద్దిరోజుల క్రితం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

దీనిపై వాదప్రతివాదనలు పూర్తవడంతో న్యాయాధికారి పి.భాస్కరరావు బుధవారం తీర్పును వెలువరించారు. రెండో శనివారం మాత్రమే పోలీసు స్టేషన్‌కు వెళ్లి సంతకాలు చేయాలని తీర్పులో పేర్కొన్నారు.

జెడ్పీ కన్వెన్షన్ రచ్చ!

(5వ పేజీ తరువాయి)

నిర్వహణ బాధ్యతలను గుట్టుచప్పుడు కాకుండా అప్పగించారు. గతంలో ఈ హాలులో ఏసీలు బిగించినట్లుగా చూపి పెద్ద మొత్తంలో బిల్లులు చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజాప్రతినిధి మనుషులే ఈ కన్వెన్షన్‌హాలు నిర్వహణ పనులు చూస్తుండటంతో ఈ హాలును అద్దెకు ఇచ్చిన సమయంలో ఖర్చుల పేరుతో తప్పుడు లెక్కలు రాసి మాయ చేస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ కన్వెన్షన్ హాలులో శుభకార్యాలు జరిగే సమయంలో లైటింగ్, డెకరేషన్, కేటరింగ్ తదితరాల పేరుతో పెద్దమొత్తంలో ధరలు నిర్ణయించి నిర్వాహకులు ముక్కుపిండి మరీ అధిక మొత్తంలో అనధికారికంగా నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

తాజాగా మరమ్మతుల ప్రతిపాదన

జెడ్పీ కన్వెన్షన్ హాలులోని సీలింగ్‌కు చెదలు పట్టిందని, కొంత మేర సీలింగ్ పడిపోయిందని చూపి ఇటీవల కొంత భాగానికి మరమ్మతులు చేశారు. అంతటితో ఆగకుండా నిన్నటి మొంథా తుఫాను ప్రభావంతో సీలింగ్ పడి పోవడానికి సిద్ధంగా ఉందని, చెదలు మరింతగా పెరిగిందనే కారణం చూపి ఈ కన్వెన్షన్ హాలును మూసివేస్తున్నట్టు ప్రకటించారు. పంచాయతీ రాజ్ ఈఈ ద్వారా సీలింగ్‌ను ఏర్పాటు చేయాలని లక్షలాది రూపాయలతో అంచనాలు రూపొందించారు. ఈ పనులకు అనుమతులు ఇవ్వాలని ప్రతిపాదనలు జెడ్పీ సీఈవోకు పంపారు. గతంలో జెడ్పీ ప్రాంగణంలోని గెస్ట్ హౌస్ మరమ్మతుల పేరుతో నామినేషన్ పద్ధతిన పనులు చేయించారు. అదికూడా జెడ్పీలో కీలక ప్రజాప్రతినిధి అనుచరుల పేరుతోనే పనులు కేటాయించారు. రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షలకు పైగా బిల్లులు చేసేందుకు ప్రయత్నాలు చేశారు. ఈ అంశం అప్పట్లో వివాదాస్పదమైంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని జెడ్పీ కన్వెన్షన్‌హాలు మరమ్మతుల కోసం పంపిన ప్రతిపాదనలకు అనుమతులు మంజూరు చేసే అంశంపై జెడ్పీ అధికారులు ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం.

ప్రభుత్వ సదస్సులు, సమావేశాలు ఇక్కడే..

ప్రభుత్వం ఉద్యోగులకు నిర్వహించే శిక్షణ కార్యక్రమాలు, సమావేశాలు, సదస్సులు జెడ్పీ కన్వెన్షన్ హాలులో తరచూ నిర్వహిస్తున్నారు. ఇలా ఉపయోగపడుతున్న హాలును సీలింగ్‌కు చెదలు పట్టిందని, కూలిపోతే ప్రమాదాలు జరుగుతాయనే కారణాలు చూపి మూసివేయడం వెనుక బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జెడ్పీలో పాలకవర్గం వైసీపీకి చెందిన వారు ఉండగా, జిల్లాలో కూటమికి చెందిన శాసన సభ్యులు ఉన్నారు. జెడ్పీ కన్వెన్షన్ హాలును వైసీపీ నాయకుల చెర నుంచి విడిపించేందుకు కూటమి నాయకులు ప్రయత్నం చేస్తున్న క్రమంలోనే మూసివేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, జెడ్పీ కన్వెన్షన్ హాలుకు మరమ్మతులు చేసేందుకు ప్రతిపాదనలు పంపామని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఇంకా పనులు చేసేందుకు అనుమతులు రాలేదని, మరమ్మతలు చేసే వరకు ఈ హాలును మూసివేయాలని నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేస్తున్నారు.

పట్టణాభిషేకం చేయాలి

(5వ పేజీ తరువాయి)

పట్టణాభివృద్ధికి అనుకూలం. ఈ పంచాయతీ వార్షికాదాయం రూ.80 లక్షలు. అవనిగడ్డ అనేక గ్రామాలకు మార్కెటింగ్ టౌన్‌గా ఉంది. కత్తిపూడి-ఒంగోలు ఎన్‌హెచ్-216 అవనిగడ్డ నుంచి వెళ్లడం కలిసొచ్చే అంశం. పర్యాటకంగా అభివృద్ధి చెందటానికి అవకాశాలు ఉన్నాయి. పులిగడ్డ-పెనుమూడి బ్రిడ్జి, హంసలదీవి బీచ్ వంటివి చూడదగ్గ ప్రదేశాలు. మోపిదేవి సుబ్బారాయుడు, శ్రీకాకుళంలోని శ్రీకాకుళానంద విష్ణు ఆలయాలు ప్రత్యేకం.

మైలవరం : ఎన్టీఆర్ జిల్లాలోని మైలవరం నియోజకవర్గం మండల కేంద్రం. విజయవాడ నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. సీఆర్డీఏ పరిధిలోని పట్టణ ప్రాంతాల్లో మైలవరం ఒకటి. పట్టణీకరణ దిశగా అడుగులు వేస్తోంది. భారీ అపార్ట్‌మెంట్లు, గ్రూప్‌హౌస్‌లు, కమర్షియల్ షాపులు, ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి. విజయవాడ-ఛత్తీస్‌గఢ్ ఎన్‌హెచ్-30 మైలవరం మేజర్ పంచాయతీ మీదుగా వెళ్తుంది. ఈ పంచాయతీ పరిధిలో 37 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం జరిగి ఉంది. ఇంజనీరింగ్ కాలేజీ ఉంది. రైస్‌మిల్లులు, సామిల్లులు, స్టోన్ క్రషర్లు, సినిమా థియేటర్లు ఉన్నాయి. మైలవరానికి దగ్గరలోనే కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ ఉంది. అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు ఈ నియోజకవర్గాన్ని తాకుతుంది. ఈ మేజర్ గ్రామ పంచాయతీ జనాభా 24 వేలు. వ్యవసాయేతర జనాభా 50.80 శాతం. మైలవరం టౌన్ అనేక గ్రామాలకు మార్కెటింగ్ ప్లేస్‌గా ఉంది.

పామర్రు : కృష్ణాజిల్లాలోని పామర్రు నియోజవర్గం మేజర్ గ్రామ పంచాయతీ. మండల కేంద్రం కూడా. జనాభా 22 వేలు. వ్యవసాయేతర జనాభా 41.72 శాతం. రానున్న రోజుల్లో మరింత పెరుగుతుంది. పంచాయతీ వార్షికాదాయం రూ.3 కోట్లు. రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు పుంజుకున్నాయి. రైస్‌మిల్లుల కేంద్రంగా ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలు 21 వరకు ఉన్నాయి. ఎన్‌హెచ్-65 ఈ గ్రామం మీదుగానే వెళ్తుంది. ఈ పంచాయతీ పరిధిలో 39 కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయి. పామర్రు మండల ప్రజలు గుడివాడ, మచిలీపట్నం పట్టణాలతో సంబంధాలు కలిగి ఉంటారు. అనేక గ్రామాలకు ఇది మార్కెటింగ్ ప్రాంతం.

విస్సన్నపేట : ఎన్టీఆర్ జిల్లాలో విస్సన్నపేట మేజర్ గ్రామ పంచాయతీ. మండల కేంద్రంగానూ ఉంది. ఈ ప్రాంతం విస్తీర్ణం 24.15 చదరపు కిలోమీటర్లు. అపార్ట్‌మెంట్లు, లే అవుట్లతో పట్టణీకరణ రూపాన్ని సంతరించుకుంది. నూజివీడు పట్టణం నుంచి 17 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. వార్షికాదాయం రూ.1.60 కోట్లు. రైస్‌మిల్లులు ఉన్నాయి. నూజివీడు-తిరువూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు ఈ ప్రాంతం మీదుగానే వెళ్తుంది. తిరువూరు నగర పంచాయతీకి దగ్గర. 20 వేల జనాభా ఉండగా, వ్యవసాయేతర జనాభా 46.67 శాతం.

కాంట్రాక్టర్ బుసబుసలు

(5వ పేజీ తరువాయి)

చెల్లించేవారు. 2019 నుంచి 2024 వరకు జోగి రమేశ్ అంటే క్లాస్1 కాంట్రాక్టర్, క్లాస్1 కాంట్రాక్టర్ అంటే జోగి రమేశ్ అన్నట్టుగా జలవనరుల శాఖలో వ్యవహారాలు సాగాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ కాంట్రాక్టర్ అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి పంచన చేరాడు. వైసీపీ పాలనలో ఎలాంటి వ్యవహారాలను చక్కబెట్టాడో వాటినే ఇప్పుడూ కొనసాగిస్తున్నాడు. ఇది కుదరదని చెప్పిన అధికారులపై ఒంటిపై లేస్తున్నాడు.

అధికారులపై నోటికొచ్చిన మాటలు

ఈ క్లాస్1 కాంట్రాక్టర్.. కొన్నేళ్ల క్రితం మచిలీపట్నం నియోజకవర్గ పరిధిలోని శివగంగ, తాళ్లపాలెం మేజర్ డ్రెయిన్లలో పూడికతీత పనులు చేశాడు. ఈ పనులకు సంబంధించిన బిల్లును భాగాలుగా తీసుకున్నాడు. తుది బిల్లు చెల్లింపునకు వచ్చేసరికి నిర్ణయించిన దాని కంటే కొంత పని పెండింగ్‌లో ఉన్నట్టు చూపించాడు. వైసీపీ ప్రభుత్వంలో ముదినేపల్లి నుంచి కైకలూరు వరకు ఉన్న పెదలంక, గూడూరు నుంచి బంటుమిల్లి వరకు ఉన్న లజ్జబండ మేజర్ డ్రెయిన్లలో పూడికతీత పనులు చేశాడు. ఇందులోనూ కొంత పని మిగిలి ఉందని చూపించాడు. వాటికి సంబంధించిన రివైజ్డ్ ఎస్టిమేట్స్ చేయాలని జలవనరుల శాఖ ఎస్ఈకి బిల్లులు ఇచ్చాడు. దీన్ని ఎస్ఈ.. కృష్ణాడెల్టా సిస్టం (కేడీఎస్) సీఈకు పంపారు. ఈ ఆర్ఈలను పరిశీలించిన ఇంజనీరింగ్ అధికారులు 2013లో పని మిగలడానికి కారణాలు ఏమిటో తెలియజేయాలని కోరారు. వాటికి సంబంధించిన డాక్యుమెంట్లను సమర్పించాలని అడిగారు. ఇంజనీరింగ్ సిబ్బంది ఆర్ఈలకు అనుమతి ఇవ్వకుండా వివరణ కోరడంతో కాంట్రాక్టర్‌కు కోపం వచ్చింది. మూడు రోజుల క్రితం కేడీఎస్ కార్యాలయానికి వచ్చి నేరుగా సీఈ చాంబర్‌లోకి వెళ్లాడు. జేఈలను లోపలకు పిలిపించుకుని సీఈ ఎదురుగా సన్నాసులు, పనికి మాలినోళ్లు అంటూ నోరుపారేసుకున్నాడు. మహిళా ఇంజనీర్లనూ ఈవిధంగానే దూషించాడు. అక్కడితో ఆగకుండా సీఈకి వేలు చూపించి అంతుచూస్తానని బెదిరించాడు. కాంట్రాక్టర్ తీరుతో కేడీఎస్ కార్యాలయంలోని ఇంజనీర్లు సామూహికంగా సెలవులో వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఆ కాంట్రాక్టర్ వ్యవహారాన్ని సీఎంవో, మంత్రి రామానాయుడు దృష్టికి తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు.

ఇష్టారాజ్యమే!

(5వ పేజీ తరువాయి)

సచివాలయ అడ్మిన్‌లతోపాటు ఇతర విభాగాల సిబ్బంది సమయపాలన పాటించడం లేదు.

బదిలీలతో గందరగోళం

జిల్లాలో 508 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో నాలుగు వేల మంది వరకు ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ ఏడాది జూన్, జూలై నెలల్లో సిబ్బంది ఐదేళ్లుగా ఒకే సచివాలయంలో పనిచేస్తున్నారనే కారణంతో మూడు వేల మందిని ఇతర సచివాలయాలకు బదిలీ చేశారు. కలెక్టరేట్, రెవెన్యూ, వైద్యశాఖ, డీపీవో కార్యాలయం, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం, సర్వే విభాగాలతో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీల కార్యాలయాల్లో వందలాది మంది సచివాలయ ఉద్యోగులు డెప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. బదిలీలు, డెప్యుటేషన్‌ల ప్రభావంతో సచివాలయాల్లో పూర్తిస్థాయిలో సిబ్బంది లేకుండా పోయారు. దీంతో ఈ లోటును పూడ్చేందుకు సచివాలయాల గ్రూపింగ్ పేరుతో అంతగా పనిలేని వీఆర్వోలు, సర్వేయర్‌లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీస్‌లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు తదితర విభాగాల్లో పనిచేసే సిబ్బందికి రెండు సచివాలయాల్లో పనిచేయాలని సూచించారు. దీంతో వారు ఎక్కడా అందుబాటులో ఉండటం లేదు. వీరు ఏ సచివాలయంలో ఉన్నారో ప్రజలకు తెలియని పరిస్థితి ఏర్పడింది. అడ్మిన్‌లు ఎక్కడున్నారని ప్రశ్నిస్తే తమ విభాగం అధికారులు వేరే చోటకు పంపారని, అక్కడ నుంచే ముఖఆధారిత హాజరు వేశామని చెబుతున్నారు. దీంతో సచివాలయ సిబ్బంది ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది.

డెప్యుటేషన్‌లు రద్దు చేయాలని ఆదేశాలు ఇచ్చినా కూడా..

వార్డు సచివాలయ సిబ్బందిలో అధిక శాతం డెప్యుటేషన్‌పై, ఇతరత్రా విభాగాల్లో అనధికారికంగా పనిచేస్తున్న విషయాన్ని రాష్ట్ర సచివాలయాల విభాగం ఉన్నతాధికారులు గుర్తించారు. తమ అనుమతి లేకుండా కలెక్టరేట్‌తో పాటు ఇతర విభాగాల్లో ఎలా పనిచేయించుకుంటారని ప్రశ్నిస్తూ, వారందరినీ సచివాలయాలకు పంపాలని ఆదేశాలు జారీ చేశారు. తప్పనిసరి పరిస్థితిలో సచివాలయ సిబ్బందికి ఇతరత్రా పనుల కోసం డెప్యుటేషన్ వేస్తే తగిన కారణాలు చూపుతూ, తమకు మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చి, తాము అనుమతులు ఇచ్చిన తర్వాత డెప్యుటేషన్‌లు వేయాలనే షరతు పెట్టారు. సచివాలయ సిబ్బందికి తాము వేతనాలు చెల్లిస్తుంటే.. మీరెలా పనిచేయించుకుంటారని కూడా లేఖలో ప్రశ్నించారు. ఈ ఆదేశాలను అన్ని విభాగాల అధికారులు తుంగలో తొక్కి యథావిధిగా తమ కార్యాలయాల్లోనే సచివాలయ సిబ్బందితో పని చేయించుకుంటున్నారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షల ఫీజులు

» డీఈవో సుబ్బారావు

విజయవాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన విద్యార్థులు ఈనెల 13 నుంచి 26 వరకు ఎటువంటి ఫైన్ లేకుండా పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ఫీజులు చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవంబరు 26 నుంచి డిసెంబరు 3 వరకు రూ.50, డిసెంబరు 4 నుంచి 10 వరకు రూ.200, డిసెంబరు 4 నుంచి 10వ తేదీ లోపు రూ.500 ఫైన్‌తో ఫీజు చెల్లించుకోవచ్చని తెలిపారు. ఫీజును వారు చదువుతున్న పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పాఠశాల లాగిన్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ ద్వారా చెల్లించుకోవచ్చని డీఈవో తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

వనభోజనాలు బంధాలను బలోపేతం చేస్తాయి: వైవీబీ

ఉయ్యూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసంలో వనభోజనాలు కుటుంబ సభ్యుల మధ్య, స్నేహితుల మధ్య బంధాలను బలోపేతం చేస్తాయని మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని చిన ఓగిరాల అభయాంజనేయస్వామి దేవస్థానం మారుతినగర్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన వనసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కుటుంబరావు, పాలడుగు రామకృష్ణ, కంచర్ల కోటేశ్వరరావు, దండమూడి చౌదరి, తుమ్మల హరీష్, ఎర్రంశెట్టి సతీష్, అజయ్, చేగొంటి వంశీ, సమన ప్రసాద్, పాలడుగు ప్రసాద్, రాయవరపు శివ తదితరులు పాల్గొన్నారు.



సేవలకు స్వస్తి.. సిబ్బంది నాస్తి

- గ్రామ, వార్డు సచివాలయాల్లో కొరవడిన సమయపాలన
- ఫీల్డ్‌విజిట్ పేరుతో సీట్లలో కానరాని ఉద్యోగులు
- అజమాయిషీలో అధికారుల నిర్లక్ష్యం
- పడిగాపులు పడుతున్న ప్రజలు

ఆంధ్రజ్యోతి విజిట్

(హనుమాన్‌జంక్షన్/ గన్నవరం/ ఉయ్యూరు/ఉంగుటూరు - ఆంధ్రజ్యోతి)

సత్వర సేవలు అందించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలపై అజమాయిషీ లేక పనిచేసే సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఆంధ్రజ్యోతి సోమవారం క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించింది. సచివాలయాలకు ఉదయం 10.30 గంటలకు హాజరు కావాల్సి ఉండగా వివిధ రకాల కారణాలతో ఆలస్యంగా హాజరవుతున్న పరిస్థితి పరిశీలనలో కనిపించింది. బాపులపాడు మండలంలో 27 గ్రామ పంచాయతీలు ఉండగా గత వైసీపీ ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన సచివాలయాల వ్యవస్థలో భాగంగా 22 గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఇందులో పని చేసే ఏఎన్ఎం, మహిళా పోలీసు సిబ్బంది మినహా వెల్ఫేర్, డిజిటల్, రెవె న్యూ, ఇంజనీరింగ్ విభాగాలు చూసే సహాయ కులను ఆయా శాఖల మండలస్థాయి అధికారులు చెప్పే పనుల్లో ఉన్నామని సాకు చూపించి కార్యాల యాలకు సమయానికి రాని పరిస్థితి నెలకొంది. సిబ్బంది ఏ సచివాలయంలో ఉన్నారో, ఏ పనిలో ఉన్నారో సూపర్‌వైజింగ్ చేసే కార్యదర్శికి కూడా తెలియని అయోమయ పరిస్థితి అధికారుల్లో నెలకొంది.



సోమవారం ఉదయం 11.45కి ఖాళీగా ఉన్న వీరపనేనిగూడెం సచివాలయం

గన్నవరం: మండలంలో 21 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. 15 శివారు గ్రామాలు ఉండగా 24 సచివాలయాలను ఏర్పాటు చేశారు. అయితే సచివాలయాలు సమయానికి తెరుచుకోవటం లేదు. పాలకుల అలక్ష్యం, ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో సమయపాలన అటకెక్కింది. సోమవారం సచివాలయాలను ఆంధ్రజ్యోతి విజిట్ చేసింది. 11గంటలైన పలు సచివాలయాల్లో సిబ్బంది రాలేదు. కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. సిబ్బంది కోసం వచ్చిన గ్రామస్తులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. గ్రామ ప్రజల సంఖ్యను బట్టి 8 నుంచి 10 మంది సిబ్బంది సచివాలయంలో ఉన్నారు.

ఉయ్యూరు: నిర్దిష్టమైన విధులు, జాబ్‌చార్ట్ లేకపోవడంతో గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల్లో కొందరికి పనిభారం కాగా, మరికొందరు ఏపనులు లేకుండా ఇష్టం వచ్చినప్పుడు వచ్చి వెళుతూ కాలక్షేపం చేస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల విజిట్‌లో భాగంగా సోమవారం ఉయ్యూరులో వార్డు సచివాలయాలు, మండల పరిధిలో గ్రామసచి వాలయాలను సందర్శించగా అక్కడున్న పరిస్థితులు ప్రస్ఫుటమయ్యాయి. ఎక్కు వ సచివాలయాల్లో కుర్చీలు ఖాళీగా కన్పించ డంతో వారి గురించి ఆరాతీయగా ఫీల్డ్‌విజిట్‌లో ఉన్నారని అక్కడున్న ఉద్యోగులు చెప్పడం గమనార్హం. ఏఎన్ ఎంలు విధులకు హాజరుకా కుండా ఆశావర్కర్లతో ఫోన్‌లో పనులు చేపిస్తూ, పీహెచ్‌సీలకు వెళ్లాము, అక్కడకు వెళ్లమని కాలం గడుపుతున్నారు.



ఉయ్యూరు వార్డు సచివాలయంలో..



బాపులపాడు సచివాలయం-2లో సిబ్బంది కోసం ఎదురు చూస్తున్న ఓ మహిళ

ఉంగుటూరు : మండలంలో 27గ్రామపంచాయతీలను 16సచివాలయాలుగా ఏర్పాటుచేశారు. గ్రామీణప్రాంత ప్రజలకు వివిధ రకాల సేవలందించేందుకు ఒక్కొక్క సచివాలయంలో 7నుంచి 11మంది చొప్పున మొత్తం 146మంది సిబ్బందిని నియమించారు. సోమవారం ఆంధ్రజ్యోతి వెల్దిపాడు గ్రామసచివాలయంలో చేపట్టిన ఆన్‌లైన్ విజిట్‌లో సిబ్బంది పనితీరు, విధి నిర్వహణ, సమయపాలనలో వారి నిబద్ధత తేటతెల్లమైంది. 10.40 గంటలైనా సిబ్బంది రాకపోవడంతో సచివాలయంలో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. కాగా వివిధ పనుల నిమిత్తం ఉదయం 10గంటలకు సచివాలయానికి వచ్చిన ప్రజలు సిబ్బంది కోసం నిరీక్షించక తప్పలేదు. ● గ్రామసచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లపై పనుల భారం, ఒత్తిడి అధికంగా వున్నట్లు పరిశీలనలో వెల్లడైంది.



వెల్దిపాడు గ్రామ సచివాలయం 2



దావులూరు సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కులాలు కాదు.. అభివృద్ధి చూడండి

● అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కులాల కుంపటి పెడుతున్నారు.. మా కులపోడు అంటూ ప్రజల నమ్మి ఓటేసి మోసపోతున్నారు.. కుల, మతాలు కాదు అభివృద్ధి చూడండి, చేసిన అభివృద్ధికి ఓటు వేయండి అని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని దావులూరులో సుమారు రూ. 40 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ డీఈ శ్రీనివాసరావు, ఏఈ రాజేష్, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, పార్టీ మండల అధ్యక్షులు జంపని వెంకటేశ్వరరావు, పార్టీ గ్రామ అధ్యక్షులు జల్లే కోటేశ్వరరావు, కొప్పుల సీతారామయ్య, చాట్ల విజయబాబు, కందుల రాజేష్, పామర్తి రమేష్, వల్లే విజయ్, గాలంకి రామకృష్ణ, గుంజా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈడుపుగల్లుకు గుర్తింపు అభినందనీయం

కంకిపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సీనియర్ ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్‌కు ఈడుపుగల్లుకు చెందిన విద్యార్థి వర్షంత్ ఎంపిక కావడం హర్షణీయమని టీడీపీ జిల్లా నాయకులు దేవినేని రాజా అన్నారు. జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ఎంపికైన వర్షంత్‌ను బుధవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా దేవినేని రాజా మాట్లాడుతూ, శ్రీవశిష్ట జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం బైపీసీ చదువుతూ, ఈడుపుగల్లులో నివాసముంటున్న వర్షంత్ అండర్ 17 ఫెన్సింగ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షణీయమన్నారు.



సీనియర్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్‌కు ఎంపికైన వర్షంత్‌ను అభినందిస్తున్న రాజా

కాల్వలో పడి ఒకరి మృతి

పెనమలూరు, నవంబరు12 (ఆంధ్రజ్యోతి): బందరు కాల్వలో కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి అందులో జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరు జిల్లా నూతక్కి గ్రామానికి చెందిన చల్లపల్లి సుధాకర్(55) విజయవాడలోని ఒక రైస్ మిల్లులో పని చేస్తుంటాడు. బుధవారం ఆటోలో ఆసుపత్రికి వెళుతూ కాలకృత్యాలు తీర్చుకోవడానికి బందరు కాల్వవద్దకు వచ్చాడు. అక్కడ ప్రమాదవశాత్తూ కాలు జారి నీటిలో పడి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

గన్నవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆర్టీసీ డిపో నుంచి పంచారామాల యాత్రకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు డిపో మేనేజర్ పి.శివాజీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో సూపర్ లగ్జరీ బస్సు ఉదయం 3 గంటలకు గన్నవరంలో బయలు దేరి అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని శైవక్షేత్రాలను దర్శించు కుని అదే రోజు రాత్రికి గన్నవరం చేరుకుంటుంద న్నారు. ఇతర వివరాలకు 87909-96090, 73829-05 633 నెంబర్‌లను సంప్రదించాలని కోరారు.

రోడ్డు అభివృద్ధి పనుల పరిశీలన

కంకిపాడు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): డిసెంబరులో మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన భవనంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రధాన రహదారి అభివృద్ధి పనులు బుధవారం ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో బసవయ్య పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నిజం చేయటమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కల నిజం చేయటమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అర్హులైన లబ్ధిదారులందరూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకాన్ని విని యోగించుకుని ఇళ్లు నిర్మించుకోవాలని పిలుపు నిచ్చారు. స్థానిక ఐటీ కళాశాల రోడ్డులో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద మహమ్మద్ జహీరా నూతనంగా ఇల్లు నిర్మించుకోగా బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే వెంకట్రావు లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, నియోజక వర్గంలో ఈ పథకం కింద 9 వేల మంది లబ్ధిదారులు ఎంపిక కాగా, ఇప్పటివరకు 3,859 మంది లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకుంటున్నట్లు చెప్పారు. వీఎన్‌పురం కాలనీలో ఇళ్ల నిర్మాణానికి కరెంటు తీగలు అడ్డుగా ఉన్నాయని వాటిని తొలగిం చాలని పలువురు యార్లగడ్డను కోరారు. తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు చిగురుపాటి కుమార స్వామి, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమ లశెట్టి రమేష్‌బాబు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చిరు మామిళ్ల సూర్యం, గూడ పాటి తులసిమోహన్, పాల డుగు నాని, మద్దినేని వెంకటేశ్వరరావు, కాసన్నేని రంగ బాబు, మేడేపల్లి రమ తదితరులు పాల్గొన్నారు.





గన్నవరంలో గృహాన్ని ప్రారంభించి తాళం అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు.. ఉయ్యూరులో మహిళలకు పసుపు కుంకుమ అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

ఉయ్యూరు: రాష్ట్రాభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఉయ్యూరు మున్సిపాలిటీ పరిధిలో ఇళ్లు నిర్మాణం పూర్తి చేసుకున్న 32 మంది లబ్ధిదారులకు పసుపు కుంకుమ ఇచ్చి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, యువ నాయకు డు నారా లోకేశ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి పేదవాడి ఇంటి కల కూటమి ప్రభుత్వంలోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉయ్యూరు మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సిద్ధార్థ వర్సిటీలో ముగిసిన వర్క్‌షాప్

కానూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): హ్యాక్ ప్రమాణం ఉన్న కృత్రిమ మేధస్సు ఏ1 వ్యవస్థల కోసం సైబర్ భద్రత అనే అంశంపై కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో గత మూడు రోజులుగా జరుగుతున్న వర్క్‌షాప్ బుధవారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్సిటీ ప్రో. వీసీ ఏవీ రత్నప్రసాద్ పాల్గొని ప్రసంగిస్తూ మాతృభాషలో సాంకేతిక విద్యను అందించే ప్రాముఖ్యతను వివరించారు. స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ డి. వెంకట్రావు, ఐటీ విభాగం హెడ్ సునీత, టీసీఎస్ ప్రతినిధి ప్రతాప్ కొల్లా, జేఎన్ టీయూహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ విశ్వనాథరాజు తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ కె. సీతాకుమారి, డాక్టర్ టి. అనూరాధ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

కానూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలని విజిలెన్స్ డిపార్టుమెంట్ డీఎస్పీ గోపు రాజీవ్‌కుమార్ అన్నారు. కానూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పబ్లిక్ స్కూల్‌లో రెండు రోజులపాటు స్పోర్ట్స్ ఎ థాన్-2025 పేరుతో జరిగే క్రీడాపోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ క్రీడా పోటీలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, విద్యార్థులు అంకితభావం కలిగిఉండాలని, ఎప్పుడూ నిరాశ చెందకుండా విజయం వైపు శాయశక్తులా ప్రయత్నించాలని సూచించారు. ప్రిన్సిపాల్ వి. సాయికృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెంచుకోని ముందుకు సాగాలన్నారు. కన్వీనర్ వీరపనేని శశికళ ప్రసంగిస్తూ క్రీడలు విద్యార్థుల్లో మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయని చెప్పారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమి కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలిత ప్రసాద్, వ్యాయా మశాఖాధిపతి రాఘవేంద్రరావు, తాతినేని శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజిలెన్స్ డీఎస్పీ గోపు రాజీవ్‌కుమార్



కానూరు నారాయణ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వైద్యశిబిరం విజయవంతం

పెనమలూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కానూరు నారాయణ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మ్యాక్సివిజన్ కంటి ఆసుపత్రి, యూనిటీ డెంటల్ ఆసుపత్రి, కొనాక్ ల్యాబ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు, సిబ్బందికి నిర్వహించిన ఈ వైద్యశిబిరంలో షుమారు ఐదువందల మందికి ఉచితంగా బీపీ, షుగర్, కంటి వైద్యపరీక్షలు, డెంటల్ పరీక్షలు నిర్వహించి తగు వైద్యసూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అహ్మద్ పాషా, షమీముద్దీన్, నేహా సల్తానా, డీజీఎం జాగర్లమూడి రవిశంకర్, డీన్ శ్రీరాం చంద్ చౌదరి, ఏజీఎం రాజశేఖరబాబు, ప్రిన్సిపాళ్లు పీఎస్సార్, అంజిబాబు, వీపీలు, ఏవోలు పాల్గొన్నారు.

నున్నలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

విజయవాడ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామ వికాస్ కాలేజీ రోడ్డులోని శ్రీ అభయ ఆంజనేయస్వామి దేవస్థానంలో విమాన శిఖర శిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమ వివరాలతో కూడిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్ర మం ఆలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం

ఉంగుటూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పిల్లల ఆరోగ్య సంరక్షణపట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా వుండాలని, న్యుమోనియా వంటి అంటువ్యాధులు సోకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారులు సూచించారు. అంగన్వాడీ పిల్లల్లో న్యుమోనియా నివారణే లక్ష్యంగా జాతీయ ఆరోగ్యమిషన్ ఆధ్వర్యంలో సోషల్ అవేర్‌నెస్ అండ్ యాక్షన్ టు న్యూట్రలైజ్ న్యుమోనియా సక్సెస్‌ఫుల్లీ(శాన్స్)పై అవగాహన కార్యక్రమం బుధవారం మండలంలోని ఉంగుటూరు, ఇందుపల్లి, పెదఅవుటపల్లి, ఆత్కూరు పీహెచ్‌సీలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు విజయప్రదీప్, తేజసాయి, శిరీష, పద్మావతి, కరీముల్లా మొహినుద్దీన్, జితేంద్రకుమార్, వాణి, హెల్త్ సూపర్‌వైజర్లు, ఎంపీహెచ్ఏలు, ఎంపీహెచ్‌వీలు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

ఉయ్యూరు : ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా బుధవారం ఉయ్యూరు మండలంలోని కాటూరు పీహెచ్‌సీలో న్యుమోనియా నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 28 వరకు జరిగే ఈ కార్యక్రమం ద్వారా రోగ నివారణపై ప్రజల్లో ప్రచారం నిర్వహిస్తామని మెడికల్ ఆఫీసర్ హిమమహేశ్వరి తెలిపారు. ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ, ప్రభుత్వం శాన్స్ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి క్షేత్రస్థాయి న్యుమోనియా నివారణ కోసం జలుబు, దగ్గు, ఎక్కువగా ఉండడం, శ్వాసతీసుకోకపోవడం వంటి లక్షణాలున్నవారు ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కొలుసు శ్రీనివాస్, బేబీ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ : పుట్టిన బిడ్డకు మొదటి ఆరు నెలల పాటు తల్లి పాలు ఇచ్చినట్లైతే న్యుమోనియా వ్యాధి నుంచి పిల్లలను రక్షించవచ్చని బాపులపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి కె.శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ న్యుమోనియా దినోత్సవం సందర్భంగా బుధవారం బాపులపాడు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముందుగా సచివాలయం-1 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో వైద్యాధికారి శ్రీనివాస్ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఫణికుమార్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



బాపులపాడులో న్యుమోనియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



నూతన గృహం ప్రారంభిస్తున్న కలెక్టర్ బాలాజీ, కొనకళ్ల నారాయణ

సొంతింటి కల నిజం చేసుకోవాలి

● కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదలందరూ తమ సొంతింటి కల నిజం చేసుకోవాలని కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబుచే రాయచోటిలో 3 లక్షల 192 ఇళ్ల గృహప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ నేపథ్యంలో నగరంలోని చింతగుంటపాలెంలో పీఎంఏవై అర్బన్ 1.0 పథకం కింద కుప్పా శ్రీనివాసరావు, సిద్దినేని యానాదిరావు నిర్మించుకున్న గృహాలను కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో కలిసి ప్రారంభించారు. అనంతరం కటకం లక్ష్మీనారాయణ ఫణికుమార్‌లకు చెందిన పీఎంఏవై 2.0 గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం దేశాయిపేటలో విన్నకోట వెంకటస్వామి నాయుడు కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ, గృహ నిర్మాణ పథకం కింద జిల్లాలో 6,708 ఇళ్లు పూర్తికాగా.. మచిలీపట్నం నియోజకవర్గంలో 1,101 పూర్తయ్యాయన్నారు. ఇల్లు ప్రతి ఒక్కరి కల అన్నారు. ఇదివరకే ఇల్లు మంజూరు చేసి పూర్తి చేయనివారు వచ్చే మార్చి 31లోగా పూర్తి చేసుకోవాలని, లేకుంటే వారికి బిల్లు చెల్లింపులు జరగకుండాపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా అధిగమిస్తూ పేదలకు ప్రాధాన్యతనిస్తూ పలు సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో గృహనిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు, ఈఈ వెంకట్రావు, ఆక్వాకల్చర్ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ లంకే నారాయణప్రసాద్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పీవీ ఫణికుమార్ పాల్గొన్నారు.





ప్రమాదంలో ధ్వంసమైన ఆర్టీసీ బస్సు, నుజ్జునుజ్జైన కారు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

గుడివాడ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాగవరప్పాడు సెంటర్‌లో రహదారిపై కారు అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. బుధవారం ఆర్టీసీ బస్సు, ఆటోను ఢీకొనడంతో ఇద్దరు స్వల్ప గాయాలపాలయ్యారు. ఏలూరు నుంచి మచిలీపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సును అతి వేగంగా వచ్చిన కారు అదుపుతప్పి ఢీకొనడంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. కారు డ్రైవర్ నిద్ర మత్తు కారణంగానే ప్రమాదం జరిగినట్టు ఒన్‌టౌన్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

రేపటి నుంచి సదరన్ స్లాట్ బుకింగ్

మచిలీపట్నం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులకు వైకల్యం నిర్ధారణకు ఈనెల 14 నుంచి సదరన్ స్లాట్ బుకింగ్ ప్రారంభించనున్నట్టు జిల్లా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆశాలత తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు తమ వార్డు, సచివాలయాల్లో సదరన్ స్లాట్ బుక్ చేసుకోవచ్చన్నారు. జిల్లా ప్రభుత్వాసుపత్రిలో మంగళవారం శారీరక, మానసిక బధిరులు, దృష్టి వైకల్యం కలవారికి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. సీఎస్‌సి లో సోమవారం సదరన్ స్లాట్ బుక్కింగ్ చేసుకోవచ్చన్నారు.

బాలికల జాడ తెలిసింది..!

పెడన, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పెడనలోని మర్కజ్ దారుల్ బీర్ పాఠశాలలో అదృశ్యమైన ముగ్గురు బాలికల ఆచూకీ లభ్యమైంది. వారి అదృశ్యంపై మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ షరీఫ్ అహమ్మద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి సత్వర దర్యాప్తు చేపట్టారు. ఈ దర్యాప్తులో బాలికలు కాకినాడలో ఉన్నట్టు తెలుసుకున్న పోలీసులు కాకినాడ వెళ్లి ఆ బాలికలను పెడనకు తీసుకువచ్చారు. పెడన స్టేషన్‌లో ఎస్ఐ జీ సత్యనారాయణ బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు.

యువకుడిపై వేధింపుల కేసు

విద్యాధరపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహానికి పెద్దలు ఒప్పుకోలేదని యువతి వెంటపడి వేధిస్తూ, ఫోన్ చేసి బెదిరిస్తున్న యువకుడి పై బుధవారం పోలీసులు కేసు చేశారు. యువతి ట్రైనింగ్ ఉద్యోగం చేస్తుంది. కంప్యూటర్ సంస్థలో కోర్సుకునే సమయంలో గురునాథ్‌అనే యవకుడు పరిచయమయ్యాడు. వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుని ఇరువురు తల్లిదండ్రులతో మాట్లాడుకు న్నారు. అయితే తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో ఆ యువతి కూడా తన పని తాను చేసుకుంటూ ఉంటుంది. గురునాథ్ తరచూ ఫోన్‌చేసి పెళ్లి చేసుకుంటానని వేధిస్తున్నాడు. ఆమె అందుకు నిరాక రించటంతో గతంలో ఇద్దరూ కలిసి దిగిన ఫొటోలను సోషల్ మీడి యాలో పెట్టి పరువు తీస్తానని బెదిరిస్తున్నాడు. వేరే వ్యక్తితో వివాహం కాకుండా చేసి, ఉద్యోగం పోయేలా చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితురాలు తల్లిదండ్రుల సహాయంతో ఫిర్యాదు చేయగా పోలీసులు అతనిపై కేసు నమోదు చేశారు.

వేధింపుల భర్తపై...

సితార సెంటర్ రాజుల వీధికి చెందిన దేరంగుల సీతామహాలక్ష్మికి 20ఏళ్ల క్రితం కృష్ణలంకకు చెందిన లారీడ్రైవర్ వెంకటేశ్వరరావుతో వివాహమైంది. వీరికి సంతానం లేదు. వెంకటేశ్వరరావు మద్యానికి బానిసై భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. దీంతో బాధి తురాలు పుట్టింటికి వెళ్లింది. పెద్దల సమక్షంలో మాట్లాడినా మార్పు రాలేదు. దీంతో బాధితురాలు భర్తపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ ఆటోడ్రైవర్ మృతి...

వాగుసెంటర్ పోతు నాగయ్య వీధిలో ఉంటున్న చాట్ల నాగరాజు (43) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 12న కిరాయి కోసం విద్యాధరపురం కబేళా సెంటర్ వద్ద ఆటో రోడ్డు పక్కన ఆపి నిలబడ్డాడు. ఇదే సమయంలో చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్‌పై నుంచి వేగంగా వచ్చిన క్రేన్ నాగరాజు ఢీకొంది. ఈ ఘటనలో నాగ రాజుకు తీవ్రగాయాలు కాగా, స్థానికులు అంబులెన్స్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాగరాజు చనిపోయాడు. మృతుడు భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మంటలు అంటుకుని వృద్ధురాలు..

అనకాపల్లి జిల్లా, కట్టవానిపాలెంలో ఉంటున్న కట్టా వరాలమ్మ నెల క్రితం పడాలవారివీధిలో ఉంటున్న కూతురు చిట్టిబోయిన కుమారి వద్దకు వచ్చింది. గతనెల 31న వరాలమ్మ టీ కోసం స్టౌను వెలిగిస్తుం డగా మంట ఎగసిపడి ఆమెకు అంటుకుంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆమెను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె చనిపోయింది. మృతురాలి కుమార్తె ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటోమొబైల్ హబ్‌గా గొల్లపూడి

● ఇప్పటికే భారీగా మెగా షోరూమ్స్ ఏర్పాటు ● తాజాగా క్యూ కడుతున్న ప్రముఖ కార్ల షోరూమ్స్
● మారుతీ, టొయోటా, టాటా కార్ల షోరూమ్స్ ఏర్పాటు ● కార్ల వినియోగదార్లకు ఇదో శుభవార్త



ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం: విజయవాడ నగరంతో పోటీపడుతూ శరవేగంగా విస్తరిస్తున్న 'గొల్లపూడి'.. కమర్షియల్ హబ్‌గా విస్తరించేందుకు అడుగులు వేస్తోంది. ఎన్‌హెచ్ 65 వెంబడి మెగా మాల్స్, హస్పిటల్స్ లైఫ్‌స్టయిల్‌కు సంబంధించిన కార్పొరేట్ షోరూమ్స్, ఫుడ్ ప్లాజాల శ్రేణిలో తాజాగా ఆటోమొబైల్ రంగం చేరింది. గొల్లపూడి ప్రాంత వాసులే కాదు ఇబ్రహీంపట్నం, మైలవరం ప్రజలు కారు కొనుక్కోవాలంటే విజయవాడ వెళ్లాల్సిన అవసరం లేదు. లగ్జరీ కార్లు రా.. రమ్మంటూ స్వాగతం పలుకుతున్నాయి. కొత్త కారు కొనాలన్నా, సర్వీసింగ్ చేయించాలనుకుంటున్నారా, స్పేర్‌పార్ట్స్ మార్చుకోవాలన్నా ఇకపై విజయవాడకు వెళ్లాల్సిన పని లేదు. ఎన్టీఆర్ జిల్లాలోని జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గ ప్రజలకు అతి చేరువగా ప్రముఖ కార్లకు చెందిన షోరూమ్స్ వచ్చేశాయి. సువిశాలమైన స్థలంలో అతిపెద్ద షోరూమ్స్ స్థాపనకు గొల్లపూడి ఒక వరంలా మారింది. విశాలమైన స్థలం అందుబాటులో ఉండటంతో అనేక మంది ఈ ప్రాంతాన్ని వ్యాపార కేంద్రంగా మార్చుకొని షోరూమ్స్ స్థాపిస్తున్నారు. ప్రముఖ కంపెనీలకు చెందిన బట్టలు, ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలకు చెందిన షోరూమ్స్ ఏర్పాటయ్యాయి. ఇప్పుడు కార్ల కంపెనీలకు చెందిన షోరూమ్స్ ఒక్కొక్కటిగా వెలుస్తున్నాయి. అనతికాలంలోనే గొల్లపూడి ఆటోమొబైల్ హబ్‌గా రూపాంతరం చెందడం ఖాయమని పలువురు అంటున్నారు.

పశ్చిమ బైపాస్‌తో మారిన రూపురేఖలు

పశ్చిమ బైపాస్‌తో గొల్లపూడి రూపురేఖలు మారిపోయాయి. గొల్లపూడికి పశ్చిమ బైపాస్ ఒక వరంలా మారింది. కృష్ణానదిపై నిర్మించిన వంతెనతో ఎన్టీఆర్ జిల్లాతో రాష్ట్ర రాజధాని ప్రాంతం అమరావతితో పాటు గుంటూరు జిల్లా సైతం కలిసి పోయింది. ఈక్రమంలో విజయవాడ నగరంలోకి వెళ్లి ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకునే కంటే గొల్లపూడిలోనే అన్నీ ఉండటంతో వినియోగదారులు వచ్చే అవకాశం ఉందనే ఆలోచనతో గొల్లపూడిలో కార్ల షోరూమ్స్ స్థాపన జరుగుతోంది.

నల్లకుంట వద్ద టాటా మోటార్స్

హైదరాబాద్ - విజయవాడ 65వ నంబరు జాతీయ రహదారి పక్కన విజయవాడ రూరల్ మండలం నల్లకుంట వద్ద జాస్పర్ సంస్థ టాటా మోటార్స్ సేల్స్ అండ్ సర్వీస్ షోరూమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈనెలలోనే ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద షోరూమ్‌ను స్థాపించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. విజయవాడ నుంచి జగ్గయ్యపేట వరకు ఎక్కడా టాటా కంపెనీకి చెందిన షోరూమ్ లేదని అది తమకు అనుకూలిస్తుందని, పశ్చిమ బైపాస్ నుంచి గుంటూరు జిల్లా వైపు నుంచి వచ్చే కార్ల కొనుగోలుదారులు సైతం తమ షోరూమ్స్‌కు వచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.

బైపాస్‌లో పృథ్వీ టొయోటా

బైపాస్ రోడ్డులో ఇప్పటికే ఏర్పాటైన పృథ్వీ టొయోటా కంపెనీ షోరూమ్‌కు వినియోగదార్ల నుంచి స్పందన లభిస్తోంది. టొయోటా కంపెనీకి చెందిన అనేక రకాల కార్ల అమ్మకాలతో పాటు సర్వీసు కూడా ఉండటంతో కలిసివచ్చే అంశం.

మారుతీ సుజుకి షోరూమ్ ఏర్పాటు

ఆంధ్రా ఆసుపత్రి పక్కనే ఆదర్శ ఆటోమోటివ్స్ వారు నూతనంగా మారుతీ సుజుకి షోరూమ్‌ను ప్రారంభించారు. పలు రకాల మారుతీ కార్ల విక్రయానికి సిద్ధంగా ఉంచారు. సేల్స్‌తో పాటు సర్వీసు అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.


మరిన్ని కార్ల షోరూమ్స్‌కు అవకాశం

భవిష్యత్‌లో మరికొన్ని కార్ల కంపెనీలకు చెందిన షోరూమ్స్ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కార్ల ప్రియుల ఆదరణను బట్టి వివిధ కంపెనీల కార్ల షోరూమ్స్ స్థాపన జరిగితే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగయ్యే అవకాశం లేకపోలేదు. అంతే కాక ఈప్రాంత భూముల యజమానులకు ఆయా భూములపై లీజుపై స్థిర ఆదాయం వచ్చే అవకాశం ఉంది.









కన్నోళ్లు దూరమై.. బతుకు భారమై..!

గమ్యమేటో తెలియక ఊరు వదిలి విజయవాడ చేరిన యువతి

కన్నీటి గాథ విన్న ఆటో డ్రైవర్ల మానవీయత ● కృష్ణలంక పోలీసులతో హోమ్‌లో చేర్పించిన ఔదార్యం

వన్‌టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): తన గమ్యమేటో తెలియక ఓ యువతి తీవ్రమైన మానసిక వేదనతో విజయవాడ బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్ల వద్దకు వచ్చి తన ఆకలి గాథను వినిపించటంతో ఆటోడ్రైవర్లు మానవీయ కోణంలో స్పందించి కృష్ణలంక పోలీసుల ద్వారా విజయవాడలోని హోమ్‌కు తరలించి తమ ఔదార్యాన్ని చాటుకున్న ఘటన బుధవారం జరిగింది. చాలా చోట్ల ఒంటరి యువతులు వస్తే ఏం జరుగుతుందో, ఎన్ని అనర్థాలు జరుగుతాయో తెలిసిందే. అయితే విజయవాడలో అందుకు భిన్నంగా ఆ యువతిని చేరదీసి అల్పాహారం అందచేసి విశాల హృదయాన్ని చాటుకున్నారు ఆటోడ్రైవర్లు.

నెల్లూరుకు చెందిన ఓ యువతికి తల్లిదండ్రులు దూరమయ్యారు. వారి తరఫున ఎవరైనా ఉన్నారో లేదో తెలియదు. బతుకు భారమైందన్న మానసిక వేదనతో గమ్యమేటో తెలియని పరిస్థితిలో ఆమె నేరుగా సొంతూరు నెల్లూరు నుంచి బస్సు ఎక్కి మంగళవారం విజయవాడ బస్టాండ్‌కు చేరుకుంది. ఉచిత బస్సు ప్రయాణం ఆమెను విజయవాడకు చేర్చింది. సెల్‌ఫోన్, పర్సు పోగొట్టుకోవడంతో అదనపు కష్టం ఎదురైంది. చేతిలో చిల్లిగవ్వ లేకపోగా, సుమారు 7 గంటల ప్రయాణం అనంతరం విజయవాడ చేరుకున్న ఆమెకు తీవ్రమైన ఆకలి ముసురుకుంది. దిక్కుతోచని స్థితిలో ఆమె నేరుగా ఆటోడ్రైవర్ల వద్దకు వచ్చి తన కన్నీటిగాథను వారికి చెప్పింది. ఆమె దీనమైన గాథను విన్న ఆటో డ్రైవర్లు అల్పాహారం అందజేశారు. ఏదైనా పని చేసుకుంటూ హాస్టల్‌లో ఉంటానని, తనను హాస్టల్‌కు చేర్చాలని కోరింది. ఆటో డ్రైవర్లు స్పందించి ఈవిషయాన్ని కృష్ణలంక పోలీసులకు తెలిపారు. వారు సీఐకు తెలియజేయగా ఆయన వెంటనే స్పందించి యువతికి పూర్తిగా రక్షణ కల్పించాలని సూచించారు. అనంతరం ఆమె వివరాలు తీసుకుని విజయవాడ బెంజిసెంటర్ సమీపంలోని వాసవ్య మహిళా మండలివారికి ఫోన్‌చేసి ఆమెను అక్కడకు చేర్చారు. ఆమె బంధువులు ఎవరైనా ఉన్నట్టయితే వచ్చి తీసుకువెళ్లే వరకు ఆమెను వాసవ్య సంరక్షణలోనే ఉంచాలని పోలీసులు సూచించారు. కృష్ణలంక పోలీసులు, ఆటో డ్రైవర్లు యువతి పట్ల చూపిన ఆదరణకు పోలీసు అధికారులు అభినందించారు.



యువతిని హోమ్‌కు తరలిస్తున్న ఆటో డ్రైవర్లు, మహిళా కానిస్టేబుల్

జైల్లో ఉన్నా అదే అల్లరి..!

బైక్ స్టంట్స్‌తో భయభ్రాంతులు ● నడిరోడ్డుపై కార్లు అడ్డంగా పెట్టి ఉపన్యాసాలు

● మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ నిరసన ప్రదర్శన
● గంటసేపు ట్రాఫిక్‌కు అంతరాయం
● ర్యాలీలో బైక్‌లను నిలిపేసిన పోలీసులపై అవినాష్ దౌర్జన్యం



మైలవరం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ తల పెట్టిన నిరసన ప్రదర్శనలో భాగంగా బుధవారం మైలవరం పట్టణంలో జోగి రమేష్ తనయుడు రాజీవ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఇందులో పాల్గొన్న యువకులు తమ ఇష్టారాజ్యంగా బైక్ సైలెన్సర్లు తీసేసి పెద్ద పెద్ద శబ్దాలతో చెక్కర్లు కొడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారు. ఎల్‌హెచ్‌ఆర్ వాణిజ్య సముదాయాల వద్ద ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద ఉపన్యాసాలు చేయడంతో దాదాపు గంటసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అనంతరం రోడ్డు మార్గాన తహసీల్దార్ కార్యాలయం వద్దకు వైసీపీ శ్రేణులు బయలుదేరారు. ఈ క్రమంలో పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు బైకులను పక్కకు పెట్టించే ప్రయత్నం చేయగా బైక్‌లను పంపాలంటూ దేవినేని అవినాష్ పోలీసులపై దౌర్జన్యం చేశాడు. తన తండ్రిని అన్యాయంగా జైల్లో పెట్టారంటూ జోగి రమేష్ తనయుడు రాజీవ్ చంద్రబాబు, లోకేశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. వైసీపీ శ్రేణుల ప్రదర్శన న్యాయ పోరాటంలా లేదని ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికే తలపెట్టినట్టుందని మైలవరం ప్రజలు అంటున్నారు. అధికారం లేకపోతేనే ఇంత రెచ్చిపోతున్నారు. అధికారంలోకి వస్తే అరాచకాలు, అల్లర్లకు హద్దు ఉండదంటున్నారు. సీఐ చంద్రశేఖర్, ఎస్సై సుధాకర్, సిబ్బందితో కలిసి భద్రతా చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను కంట్రోల్ చేశారు.



నడిరోడ్డుపై కార్లు అడ్డంగా పెట్టి పోలీసులపై దౌర్జన్యం చేస్తున్న దేవినేని అవినాష్

పర్యాటక హబ్‌గా ఎన్టీఆర్ జిల్లా

● టెంపుల్, ఎకో టూరిజంపై ప్రత్యేక దృష్టి ● ట్రైనీ ఐఏఎస్‌లతో కొండపల్లి ఖిల్లాపై ట్రెక్కింగ్ చేసిన కలెక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏ ప్రాంతమైనా అభివృద్ధి పథంలో నడవాలంటే పర్యాటక రంగం ఎంతో కీలకమని స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ గ్రోత్ ఇంజన్‌గా పర్యాటకం ఉందని ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ అన్నారు. ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణ పొందుతున్న 20 మంది ట్రైనీ ఐఏఎస్‌లతో ఫీల్డ్ స్టడీ అండ్ రీసెర్చ్ ప్రోగ్రామ్ భాగంగా జిల్లాలో పర్యటించారు. ఇందులో భాగంగా బుధవారం వారితో కలిసి ఆయన కొండపల్లిఖిల్లా పైకి ట్రెక్కింగ్ చేశారు. ఈసందర్భంగా కొండపల్లి ఖిల్లా చారిత్రక వైభవాన్ని ఆయన మ్యాప్‌లో చూపుతూ వివరించారు. చారిత్రక కట్టడాల వద్ద వారితో కలిసి ఫొటోలు దిగారు. కొండపల్లి ఖిల్లా సందర్శన సందర్భంగా స్మార్ట్ ఫోన్‌తో స్కాన్ చేస్తే చాలు చారిత్రక నేపథ్యం గురించి సమాచారం లభించే సాంకేతికతను ట్రైనీ ఐఏఎస్‌లకు వినూత్న పర్యాటక అనుభవాన్ని అందించింది. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజంలో అభివృద్ధికి మంచి అవకాశాలున్నాయన్నారు. ఇప్పటికే టూరిజం గైడ్లుగా యువతకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. కొండపల్లి కోటను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసేందుకు చొరవ తీసుకుంటున్నామన్నారు. అలాగే కొండపల్లి కొయ్య బొమ్మల ప్రత్యేకతను, ప్రాముఖ్యతను తెలిపేలా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొండపల్లి కోటకు వెళ్లేదారిలో పెద్ద ఆర్చ్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. డీఆర్‌డీఏ పీడీ ఏఎన్వీ నాంచారరావు, ఏపీ అడ్వెంచర్ అసోసియేషన్ (ఏపీఏఏ) ప్రెసిడెంట్ డాక్టర్ తరుణ్ కాకాని, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ట్రైనీ ఐఏఎస్‌లకు కొండపల్లి ఖిల్లా ప్రత్యేకత వివరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

రక్షిత తాగునీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

కలెక్టరేట్: తాగునీటి పథకాలకు సంబంధించి పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, అలాగే నిరంతర పర్యవేక్షణ చేయాలని, క్లోరినేషన్ కలిపిన నీటిని మాత్రమే సరఫరా చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ లక్ష్మీశ తన చాంబర్‌లో గ్రామీణ నీటి సరఫరా పథకాల పనుల ప్రగతి తాగునీటి సరఫరాపై ఆయా శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, మెడికల్, హెల్త్, భూగర్భజల శాఖ, తదితర శాఖల అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి తాగునీటి సరఫరాలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జెడ్పీ సీఈవో కే కన్నమనాయుడు, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎస్ విద్యాసాగర్, ఐసీడీసీ పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగం, జిల్లా వ్యవసాయ అధికారిణి డీఎంఎఫ్ విజయకుమారి, డీఈ వీ రవికుమార్, ఏఈ దయానంద్, కాంట్రాక్టర్ వీ రామారావు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్లు సకాలంలో అందజేయాలి

రైల్వేస్టేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైల్వే పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికెట్లను సంబంధిత అధికారులకు సకాలంలో అందజేయాలని డిపార్టుమెంట్ ఆఫ్ పెన్షనర్స్ విభాగం కార్యదర్శి పర్వేశ్ కుమార్ తెలిపారు. బుధవారం డీఆర్ఎం కార్యాలయం ప్రాంగణంలోని కేఎస్ఎన్‌మూర్తి భవన్‌లో రైల్వే పెన్షనర్ల కొరకు డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ల శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పర్వేశ్ కుమార్ మాట్లాడుతూ ఈ శిబిరం పెన్షనర్లకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జీఎన్ శ్రీనివాసరావు, డివిజనల్ సెక్రటరీ కామేశ్వరరావు, నేతలు సాయి మోహన్ పాల్గొన్నారు.



రైల్వే టికెట్ల తనిఖీల ఆదాయం రూ.8.59 కోట్లు

రైల్వేస్టేషన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైల్వే వ్యవస్థ సమగ్రత, సామర్థ్యాన్ని నిలబెట్టటంలో రైల్వే టికెట్ తనిఖీ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని విజయవాడ డీఆర్ఎం మోహిత్ సోనాకియా అన్నారు. డీఆర్ఎం ఆదేశాల మేరకు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ బీ ప్రశాంత్ కుమార్ ఆధ్వర్యంలో అక్టోబరులో విజయవాడ డివిజన్‌లో టికెట్ చెక్కింగ్ సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహించగా రికార్డు స్థాయిలో రూ.8.59 కోట్లు ఆదాయం సమకూరింది. టికెట్లు లేకుండా ప్రయాణించిన 56,957 కేసుల్లో రూ.5.06 కోట్లు, 64,998 అక్రమ రవాణా కేసుల్లో రూ.3.50 కోట్లు, 871 బుకింగ్ చేయని లగేజీ కేసుల్లో రూ.1.77 లక్షలు లభించాయి. ఈ సందర్భంగా బుధవారం డీఆర్ఎం సమావేశపు కార్యాలయంలో టికెట్ చెక్కింగ్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి వారికి ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ టికెట్ చెకింగ్ సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. అసిస్టెంట్ కమర్షియల్ మేనేజర్ బీవీఎస్ఎస్ రవిప్రసాద్ పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి ఏడాది జైలు

జి.కొండూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో గ్రామానికి చెందిన శీలం మహేష్ (23)కు ఏడాది జైలు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కృష్ణాజిల్లా మచిలీపట్నం పోక్సో కోర్టు సెషన్స్ జడ్జి గాజుల వెంకటేశ్వర్లు తీర్పు ఇచ్చినట్టు జి.కొండూరు ఎస్సై సతీష్ బుధవారం తెలిపారు. 2021 జూలై 21న బాలిక బాత్రూంలో స్నానం చేస్తుండగా తొంగి చూశాడు. ఇది గమనించిన పోయాడు. దీంతో బాలిక తల్లి జీ కొండూరు పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై రాజనాల ధర్మరాజు కేసు నమోదు చేశారు. కేసులో 8 మంది సాక్షులను విచారించి దర్యాప్తు పూర్తిచేసి చార్జ్‌సీట్‌ను ఎస్‌పీఎల్, పోక్సో కోర్టులో ఫైలింగ్ చేశారు. కోర్టులో వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చినట్టు ఎస్సై తెలిపారు.



పీఎంఏవై గృహాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

పేదల సొంతింటి కల నెరవేర్చుతాం

● ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్

వత్సవాయి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ప్రధాన మంత్రి యోజన పథకంలో పూర్తయిన గృహాలను ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్‌తో కలిసి కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలకు గ్రామీణ ప్రాంత వాసులకు 3 సెంట్లు, పట్టణ ప్రాంత వాసులకు 2 సెంట్లు స్థలం ఇచ్చి పక్కా గృహాలు నిర్మిస్తామన్నారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కృషి చేస్తున్నాయన్నారు. ప్రజా ప్రతినిధులు సహకరించాలన్నారు. సీపీఎం నేత చిరుమామిళ్ల హనుమంతరావు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఆర్డీవో బాలకృష్ణ, హౌసింగ్ పీడీ రజనీ కుమారి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రాంబాబు, టీడీపీ మండలాధ్యక్షుడు వడ్లమూడి రాంబాబు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పాయకాపురం, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని వేగంగా నడిపిన బాలుడు మహిళ మృతికి కారణమయ్యాడు. కర్రీపాయింట్‌లో కూరకోసం వచ్చిన మహిళ బాలుడి దూకుడుకు అకారణంగా బలైపోయింది. పాయకాపురం ప్రకాష్‌నగర్ ప్రాంతంలో బుధవారం జరిగిన ఘటన వివరాలిలా ఉన్నాయి. బెజ్జం కుమారి (50) ప్రకాష్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటోంది. బుధవారం సాయంత్రం సమీపంలోని కర్రీపాయింటుకు వెళ్లి తిరిగి వస్తుంది. మార్గమధ్యంలో మోహనరావు హోటల్ సెంటర్ వద్ద ద్విచక్రవాహనంపై ముగ్గురు మైనర్లు వేగంగా వచ్చి మహిళను ఢీకొట్టారు. దీంతో మహిళ కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. నున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని, మైనర్లను అదుపులోకి తీసుకున్నారు.

ఇదిలా ఉండగా శివారుల్లోని పాయకాపురం, అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాల్లో మైనర్ల దూకుడు ఎక్కువైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని పోలీసులు, ప్రభుత్వాలు ఎంతో హెచ్చరిస్తున్నా తల్లిదండ్రుల తీరుమారకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా వాహనాలు నడిపే మైనర్ల దూకుడుకు కళ్లెం వేసి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128, 137, 148
చికెన్ విత్ స్కిన్	246
చికెన్ స్కిన్‌లెస్	256

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

తాగు నీరు వృథా

తోట్లవల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు ఎస్సీ కాలనీలో ఆర్‌సీఎం పాఠశాల వెనుక పబ్లిక్ కుళాయి పైపు విరిగిపోయింది. దీంతో స్థానికులు విరిగిన పైపుకి సైకిల్ ట్యూబ్ కట్టి మంచినీరు పట్టుకుంటున్నారు. ఎవ్వరు లేని సమయంలో తాగునీరు వృథాగా డ్రెయిన్‌లో కలిసిపోతోంది. అలాగే ఆర్‌సీఎం పాఠశాలలో(స్కూల్ మూతపడింది) గతంలో విద్యార్థుల కోసమని పంచాయతీ వారు వేసిన రక్షిత మంచినీటి కుళాయి నుంచి తాగునీరు వృథాగా కాలువలో కలిసిపోతోంది. ఉదయం, సాయంత్రం ఎప్పుడు చూసినా తాగునీరు వృథా అవుతోంది. పంచాయతీ అధికారులు స్పందించి తాగునీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


విరిగిపోయిన పబ్లిక్ కుళాయికు కట్టిన సైకిల్ ట్యూబ్


డ్రెయిన్లపై బడ్డీలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

డ్రెయిన్లపై ఆక్రమణల తొలగింపు

గుడ్లవల్లేరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి, సంత బజార్లలో విచ్చల విడిగా ఆక్రమణలను చేసిన బడ్డీలు, దుకాణాల క్రమబద్ధీకరణ పనులకు బుధవారం గ్రామ పంచాయతీ అధికారులు శ్రీకారం చుట్టారు. తొలి దశగా డ్రెయినేజి దాటి ముందుకు వచ్చిన సిమెంట్ సప్టాలు, ఫ్లోరింగ్‌లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసిన వాటిని తొలగించారు. అలానే బడ్డీలు, తోపుడు బండులు స్థిరంగా ఉంచేసిన వాటిని పంచాయతీ సిబ్బంది తొలగించి ట్రాక్టర్‌లో తరలించారు. కాగా కొన్ని నెలలక్రితం టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి గ్రామంలో ఆక్రమణలు, అక్రమంగా కట్టిన దుకాణాలను తొలగించాలని పిర్యాదు చేసిన విషయం విధితమే. ఆక్రమణల తొలగింపు చర్యలకు ఇది తొలిఅడుగుగా పంచాయతీ అధికారులు వెల్లడిస్తున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.


రమేష్ చౌదరి తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

చలసాని సరోజినికి నివాళులు

పెదపారుపూడి: వెంట్రప్రగడలో మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి తల్లి సరోజిని పెదకర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ వీరంకి గురుమూర్తి, మాజీ ఎమ్మెల్సీ రాజేంద్ర ప్రసాద్, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, మాజీ ఎంపీపీ పునుకొల్లు వెంకటరత్న ప్రసాద్, పాపాయి, పీఏసీఎస్ అధ్యక్షులు కూచిపూడి సుబ్బయ్య, పొనుగోటి సత్యనారాయణ, గొరిపర్తి రవికుమార్, కూచిపూడి శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ చిలకా ఆంజనేయులు, గారపాటి నాగబాబురావు, మాయ విజయబాబు, కాటమరాజు, కిషోర్, నాగదేసి సునీత, నత్తా వాణి పాల్గొన్నారు.


మోటూరు సచివాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు


ఉదయం 11 గంటలకు నిర్మానుష్యంగా ఉన్న గుడ్లవల్లేరు సచివాలయం


మొవ్వ సచివాలయం-1లో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు


కురుమద్దాలి సచివాలయంలో 11.15గంటలకు హాజరైన ఉద్యోగి

సచివాలయాల్లో సమయపాలనేదీ..!

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలందించాలనే సంకల్పంతో విజన్ యూనిట్‌గా ముందుకు సాగుతుంది. సచివాలయాలను ఆంధ్రజ్యోతి బృందం చేసిన క్షేత్రస్థాయి పరిశీలనలో పలు విషయాలు వెలుగు చూశాయి.

- సమస్యల పరిష్కారంలో అలసత్వం
- సచివాలయాల్లో సిబ్బంది కొరత
- మొరాయిస్తున్న కంప్యూటర్లు

గుడివాడ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గుడివాడరూరల్ మండలంలో 12 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో ఎక్కువ మంది సమయపాలన పాటించటం లేదు. ఇంజనీరింగ్, వెటర్నరీ, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు వారి వారి శాఖల్లో పనులు ఉన్నాయని వెళ్లిపోతున్నారు. సిబ్బంది 11 గంటలకు సైతం సచివాలయానికి హాజరు కావటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు గ్రామ సచివాలయం -1, 2 సచివాలయాల్లో విజిట్ చేయగా సచివాలయం -1 లో డ్యూటీ ప్రారంభ సమయం 10 గంటలకు ఒక్కరూ హాజరు కాలేదు. గుడ్లవల్లేరు మండలంలో 17 సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌లు 12 మంది ఉండగా 5 ఖాళీలు ఉన్నాయి. కౌతవరం, గుడ్లవల్లేరు-2, డోకిపర్రు-2, కూరాడ, విన్నకోట సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్‌లు లేరు(ఖాళీగాఉన్నాయి). గుడ్లవల్లేరు -2, అంగలూరు, వడ్లమన్నాడు, వేమవరం సచివాలయాల్లో అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు లేరు..

కూచిపూడి : గ్రామ సచివాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించటం లేదు. ఉదయం 11.30, 12 గంటల సమయానికి సైతం సిబ్బంది రాకపోవటంతో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. మండలంలో 16 సచివాలయాలు ఉండగా, 10 సచివాలయాలకు పైగా సిబ్బంది కొరత వేదిస్తోంది. సిబ్బంది సమయపాలన పాటించటం లేదు. ఫేస్ యాప్ ద్వారా హాజరు వేయించుకుని వ్యక్తిగత పనులపై బయటికి వెళ్తూ ఫీల్డ్‌లో ఉన్నట్లు నమ్మబలుకుతున్నారు. ఇవి పరిశీలనలో బయటపడ్డాయి. కూచిపూడి, పెదపూడి, నిడుమోలు, ఆవిరిపూడి, భట్లపెనుమర్రు, పెడసనగల్లు, కోసూరు, కాజ వంటి పలు సచివాలయాల్లో 12 గంటల సమయమైనా పలువురు సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కాలేదు.

నందివాడ: మండలంలో 23 పంచాయతీలకు గానూ 12 సచివాలయాలు ఉన్నాయి. వాటిలో పని చేస్తున్న అధికారులు డిజిటల్ అసిస్టెంట్ కార్యదర్శి తప్ప మిగిలిన వారంతా నామకార్థంగా పనులు నిర్వహించటం తప్ప పెద్దగా పని చేయటం లేదని గ్రామాల ప్రజలు వాపోతున్నారు. మహిళా పోలీసు అయితే కుర్చీలకే పరిమితమయ్యారు. మండలంలో 12 సచివాలయాల్లో 81 మంది సచివాలయ సిబ్బంది ఉన్నారని, రుద్రపాక, పోలుకొండ, ఇలపర్రు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లు లేరని ఎంపీడీవో మల్లేశ్వరి తెలిపారు.


తోట్లవల్లూరు గ్రామ సచివాలయంలో ..

సమాధానం చెప్పే దిక్కులేదు

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో గ్రామ సచివాలయం-1, గ్రామ సచివాలయం-2లను ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఆంధ్రజ్యోతి బృందం విజిట్ చేయగా ఉద్యోగులు సమయానికి రాలేదు. నెల రోజుల నుంచి తాను తిరుగుతున్నా రేపు, ఎల్లుండి అంటూ తిప్పుతున్నారని రమేష్ చెప్పారు. తోట్లవల్లూరు శివారు కలాసమాలపల్లికి చెందిన టి విజయరాణి ఇంటి డాక్యుమెంట్లు గ్రామ సచివాలయం-2కి 11.10 గంటలకు రాగా సమాధానం చెప్పేవారు లేరని తిరిగి వెళ్లిపోయారు. అలాగే ఆకునూరి వెంకట సుబ్బమ్మ కరెంటు బిల్లు కట్టేందుకు గ్రామ సచివాలలయం-1కి వచ్చి ఎవ్వరు కట్టించుకునే వారు లేరని తిరిగి వెళ్లారు. అంగడాల భ్రమరాంబ వృద్ధాప్యంలో అనారోగ్యంతో బాధపడుతూనే కరెంటు బిల్లు కట్టాలంటూ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు సచివాలయం వద్దే ఉండి తిరిగి వెళ్లారు.

పామర్రు : పామర్రు పరిధిలోగల సచివాలయాలను ఆంధ్రజ్యోతి బృందం సందర్శించింది. పామర్రులో 1,2,3,4,5 సచివాలయాలతోపాటుగా, కురుమద్దాలి, జుజ్జవరం గ్రామ సచివాలయాలను సందర్శించారు. ఈ సచివాలయంలో రెండు కంప్యూటర్లగాను ఒకటి మరమ్మతులకు గురై మూల కు చేరింది. మరోకటి ఉన్నా అదిసైతం నామమాత్రంగానే పని చేస్తుండంతో కొత్త రేషన్‌కార్డులతోపాటు ఇతర పథకాలకోసం దరఖాస్తు నమోదు చేసుకునేందుకు వచ్చేవారికి అది అప్పుడప్పుడు మొరాయించడంతో ప్రజలు గంటల తరబడి సచివాలయాల్లో వేచి ఉండక తప్పడం లేదు. నాలుగు, ఐదు సచివాలయాల్లో కంప్యూటర్లు, ప్రింటర్లు పనిచేయక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కోమరవోలు సచివాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ కొరత ఉంది.

పెదపారుపూడి : మండలంలోని 19 గ్రామపంచాయతీలకు గానూ 9 సచివాలయాలుగా ఏర్పాటు చేశారు. ఈ సచివాలయాల్లో వివిధ రకాలుగా సేవలందించేందుకు 77 మంది సిబ్బందిని నియమించారు. ఒక్కొక్క సచివాలయంలో 10 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. కార్యాలయంలో ఎక్కువగా డిజిటల్ అసిస్టెంట్, కార్యదర్శి, వీఆర్వోలు పని భారంతో సతమతమవుతున్నారు. అసలు పనే లేకుండా మహిళా పోలీసు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వెల్ఫేర్ శాఖల ఉద్యోగులు ఖాళీగా ఉంటున్నారు. పెదపారుపూడి సచివాలయం పూర్తయిన వెళ్లకుండా పంచాయతీ ఆఫీసులోనే సచివాలయ సిబ్బంది పని చేస్తున్నారు.


పెదపారుపూడి పంచాయతీ కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్న సచివాలయ ఉద్యోగులు


క్రీడాకారులను అభినందిస్తున్న స్టేడియం కమిటీ సభ్యులు

ఖో ఖో పోటీల్లో స్టేడియం క్రీడాకారులకు కాంస్య పతకం

గుడివాడ, నవంబరు 12(ఆంధ్రజ్యోతి) : విజయనగరంలో ఈ నెల 8నుంచి 10వ తేదీ వరకు జరిగిన అండర్-19 రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీల్లో స్థానిక ఎన్టీఆర్ స్టేడియం క్రీడాకారులు కాంస్య పతకాన్ని సాధించడం అభినందనీయమని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక స్టేడియం కార్యాలయంలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో ప్రతిభ చూపిన డి.రాకేశ్, యమ్.లక్ష్మీధర్‌లు 2026జనవరిలో మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో జరుగనున్న జాతీయ స్థాయి ఖో-ఖో పోటీలకు ఎంపికవ్వడం గుడివాడకే గర్వకారణమన్నారు. ఈ సమావేశంలో స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, ఖో-ఖో కోచ్ కత్తి చైతన్య, ఖో-ఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మడకా ప్రసాద్ పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల్లో రికార్డుల తనిఖీలు

పెదపారుపూడి: రైతు నేస్తాలుగా రైతు సేవా కేంద్రాలు పని చేయాలని, ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి సమస్య రాకుండా చూడాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. పెదపారుపూడిలోని రైతు సేవా కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి అవకతవకలు జరిగిన ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, గ్రామ సర్పంచ్ సమీరా, కిషోర్, పాల్గొన్నారు.

విన్నకోటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

గుడ్లవల్లేరు : విన్నకోట జనార్దన స్వామి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ద్వారా వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం ప్రారంభించామని సొసైటీ సీఈవో పుల్లేటి నాగమల్లేశ్వరరావు తెలిపారు. తొలిరోజు బుధవారం 600 ధాన్యం బస్తాలను రైతుల నుంచి కొనుగోలు చేసి ఒక లారీ, ఒక ట్రాక్టర్‌లో ధాన్యాన్ని లోడ్ చేసి మిల్లుకు తరలించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో త్రీమెన్ కమిటీలోని మన్స్ పేర్ని యేసుకుమార్, వీరంకి శ్రీవెంకట సత్యానారాయణ, జనసేన జిల్లా కార్యదర్శి పేర్ని జగన్ తదితరులు పాల్గొన్నారు.

వరి కోతల సమయంలో మెళకువలు పాటించాలి

● ఏడీఏ సూరపనేని కవిత

గుడివాడ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి పంటను కోసేటప్పుడు మెళకువలు తెలుసుకోవాలని ఏడీఏ సూరపనేని కవిత అన్నారు. బుధవారం దొండపాడు లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ రైతు పండించిన ధాన్యాన్ని ఆర్ఎస్‌కేలలో అమ్ముకోవాలని తెలిపారు. కోసే ముందు పొలంలో బురద లేకుండా, వాతావరణ మార్పులు లేనప్పుడు కోసుకోవాలని తెలిపారు. రైతుల్లో అవగాహన ఉండాలని తెలిపారు. నూర్పిన తర్వాత ఆర్ఎస్‌కేల్లో పేర్లు నమోదు చేసుకుని క్రమపద్ధతిలో తమ ధాన్యాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకుని అమ్ముకోవాలన్నారు. ఎన్ని బ్యాగులు కావాలో ఆర్ఎస్‌కేలో వివరాలు తెలియజేయాలన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సక్రమంగా తమ ధాన్యాన్ని అమ్ముకోవటానికి సకల ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బంది అందుబాటులో ఎల్లప్పుడు ఉన్నారని తెలిపారు. గోనె సంచులు ఎప్పటికప్పుడు ఆర్ఎస్‌కేల్లో నిల్వ ఉంచామని తెలిపారు. మండల వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మీ, డీసీ ఛైర్మన్ నూతక్కి కుటుంబరావు, రైతులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ కవిత

పేదలకు సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదవాడి కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చుతున్న ఘనత సీఎం చంద్రబాబుదేనని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల సొంతింటి కలను నెరవేర్చడం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎంఏవై, ఎన్టీఆర్ గృహ పథకానికి ఎంపికై గృహనిర్మాణం పూర్తిచేసుకున్న ఈసాని జ్యోతి, మాణిక్యలరావు దంపతుల సొంతింటి నూతన గృహ ప్రవేశంలో బుధవారం ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామర్రులో గృహకల్ప పథకం ద్వారా 723 ఇళ్లు నిర్మించామన్నారు. రాబోయే మూడేళ్లకాలంలో మరెన్ని ఇళ్లను అదనంగా నిర్మించి అర్హులైన పేదలకు కానుకగా అందిస్తామన్నారు. తొలుత లబ్ధిదారుడికి ప్రభుత్వం తరుపున స్వీట్లు, నూతన వస్త్రాలను దంపతులకు ఎమ్మెల్యే అందజేశారు. కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ వల్లూరిపల్లి గణేష్, హౌసింగ్ డీఈఈ శివప్రసాద్, ఏఈ పెదపూడి పవన్‌కల్యాణ్, కూటమి నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఇందిరానగర్‌లో గృహ ప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా

ఊపిరితిత్తులను ఆరోగ్యంగా ఉంచుకోవాలి

● డాక్టర్ టి. సాయిప్రసన్న

తోట్లవల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఊపిరితిత్తుల(న్యూమోనియా)కు వచ్చే ఇన్‌ఫెక్షన్‌ను సరైన సమయంలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందని పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ టి సాయిప్రసన్న తెలిపారు. ప్రపంచ న్యూమోనియా దినోత్సవం సందర్భంగా బుధవారం తోట్లవల్లూరు పీహెచ్‌సీ నుంచి సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ రోహిణి, శారద, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కూచిపూడి : ప్రపంచ న్యూమోనియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మొవ్వ, కూచిపూడి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహించారు. పుట్టిన పిల్లల దగ్గర నుంచి ఐదు సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు సంభవించే న్యూమోనియా వ్యాధి లక్షణాలు, చికిత్స విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారులు డాక్టర్ సీహెచ్.రాజేశ్వరి, డాక్టర్ విజయకుమార్‌ల పాల్గొన్నారు.


తోట్లవల్లూరులో ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

గుడ్లవల్లేరు : ప్రపంచ నిమోనియా దినం సందర్భంగా గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఏఎన్ఎం, ఆశావర్కర్లు అవగాహనా ర్యాలీ నిర్వహించారు వైద్యాధికారిణి డాక్టర్ టి.ప్రవీణ మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలకు శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.యశశ్విని, సీహెచ్‌వో అనురాధ, సూపర్‌వైజరు వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జడ్పీ విద్యార్థుల ఎంపిక

కూచిపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): వివిధ విభాగాల్లో మొవ్వ జడ్పీ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల పీడీ ఎం.మనోహరి తెలిపారు. హై జంప్, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, ఖో-ఖో, వాలీబాల్ పోటీల్లో పాల్గొనేందుకు శ్యామ్యూల్, బాల హర్ష వర్ధన్, సాంబశివరావు, సంకీర్తన, నవదీప్, జాహ్నవి, స్వీటీ, ప్రకాశం, చందు, సమంత, ఉమశ్రీలు ఎంపికయ్యారు. పాఠశాల హెచ్ఎం ఉమశ్రీ, విజేతలైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కాలనీలో రహదారుల పరిశీలన

గుడ్లవల్లేరు:గుడ్లవల్లేరులోని నూతన కాలనీలో అంతర్గత రహదారులు నిర్మాణంలేక ఆ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బుధవారం కాలనీలో అంతర్గత రహదారులను పంచాయతీరాజ్ ఏఈ నాగేశ్వరరావు, టీడీపీ క్లస్టర్ ఇంచార్జ్ పోలవరపు వెంకటరావులు పరిశీలించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

పెదపారుపూడి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ బి.శ్రీను నాయక్ పేర్కొన్నారు. రైతుల భూ సమస్యల పరిష్కారంలో భాగంగా బుధవారం మండల పరిధిలోని యలమర్రు, ఈదులమద్దాలి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. యలమర్రులో 13, ఈదులమద్దాలిలో 7 అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ తెలిపారు.

వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయొద్దు : కైలే

పామర్రు: పేద విద్యార్థుల ఉన్నతి కోసం ప్రభుత్వం నిర్మించి నిర్వహించాల్సిన వైద్య కళాశాలలను ప్రైవేటీకరణచేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిరంకుశత్వ నిర్ణయాన్ని తక్షణమే ప్రభుత్వం వెనక్కితీసుకోవాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. బుధవారం పామర్రులో వైద్యకళాశాలలను ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. డిప్యూటీ తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు

పిల్లల దత్తత చట్టబద్ధంగా జరగాలి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగ మల్లేశ్వరి

తోట్లవల్లూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సంతానం లేని వారు పిల్లలను దత్తత తీసుకునే విషయంలో జేజే యాక్ట్ 2015 సెక్షన్ 80 , 81 ప్రకారం చట్టబద్ధంగా చేయకుంటే 3 నుంచి 5 సంవత్సరాల జైలు శిక్షకు గురయ్యే ప్రమాదం ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె నాగమల్లేశ్వరి తెలిపారు. మండలంలోని కనకవల్లి అంగన్వాడీ కేంద్రం వద్ద, పెనమకూరు సచివాలయం వద్ద బుధవారం పిల్లల దత్తతపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు భద్రిరాజుపాలెంలో మాతృత్వం ఒక వరం, దత్తత మరో మార్గం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత మహిళలకు అవగాహన కల్పించారు. ఏఎన్ఎం శైలజ, హరిత పాల్గొన్నారు.


పామర్రు అంగన్వాడీ కేంద్రంలో..


పెనమకూరులో..

పెదపారుపూడి: చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత తీసుకోవటం నేరమని అంగన్వాడీ సూపర్‌వైజర్ అరుణ కుమారి అన్నారు. చినపారుపూడిలో జాతీయ దత్తత అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు.అంగన్వాడీ సూపర్‌వైజర్ ఎం.శివనాగమణి తదితరులు పాల్గొన్నారు.

పామర్రు : సమాజంలో ప్రతిబిడ్డకూ కుటుం బం ఉండటం ప్రాథమిక హక్కుని, దత్తత అనేది ప్రేమతోకూడిన సామాజిక బాధ్యతగా భావించి దానిపట్ల పూర్తి అవగాహన కలిగి యుండాలని పామర్రు ఐసీడీఎస్ సూపర్వైజర్లు నూతక్కి సత్యశ్రీ, విజయకుమారిలు అన్నారు. బుధవారం పామర్రు అరండల్‌పేట, అడ్డాడ గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు.

ఉప్పెన స్మారక సభకు విచ్చేయండి

అవనిగడ్డ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గాంధీక్షేత్రంలో ఈనెల 19న జరుగనున్న దివిసీమ ఉప్పెన 48వ వార్షిక స్మారక సభకు మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయను ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆహ్వానించారు. బుధవారం హైదరాబాద్‌లో దత్తాత్రేయను ఆయన స్వగృహంలో కలిసి ఉప్పెన సమయంలో దత్తాత్రేయ చేసిన సహాయాన్ని గుర్తుచేసి స్మారక సభకు రావాల్సిందిగా ఆహ్వానించారు.


బండారు దత్తాత్రేయను ఆహ్వానిస్తున్న మండలి బుద్ధప్రసాద్


రైతులతో మాట్లాడుతున్న జేసీ నవీన్

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు రానీయొద్దు

● రైతుసేవా కేంద్రాల సిబ్బందికి జేసీ నవీన్ సూచన

బంటుమిల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని రైతుసేవా కేంద్రాల సిబ్బందికి జాయింట్ కలెక్టర్ నవీన్ సూచించారు. అర్తమూరు, ముల్లపర్రు రైతుసేవా కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. అర్తమూరుకు చెందిన రైతు మర్రె వెంకట శ్రీనివాసరావుతో మాట్లాడారు. గోనె సంచుల లభ్యతపై అడిగి తెలుసుకున్నారు. వరి కోతకు ముందే సంచులు కావాలని రైతుసేవా కేంద్రాలలో సమాచారం ఇస్తే సకాలంలో సమకూరుస్తున్నారని, తెలిపారు. ముల్లపర్రులో రైతు పోతుమర్రి రాధాకృష్ణతో మాట్లాడారు. గత సంవత్సరం ఆర్బీకేకు తోలిన ధాన్యం డబ్బులు ఇంతవరకు పడలేదని రైతు ఆవేదన వ్యక్తం చేయగా అర్జీ పరిశీలించి సాంకేతిక లోపం కారణంగా పడలేదని గుర్తించా రు. సత్వరమే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇ చ్చా రు. ఏవో అజయ్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వాన్ని సహించం

● పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో డీపీవో అరుణ

మోపిదేవి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణలో అలసత్వాన్ని సహించబోమని జిల్లా పంచాయతీ అధికారిణి(డీపీవో) జె.అరుణ హెచ్చరించారు. బుధవారం మధ్యాహ్నం పెదకళ్లేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మండలంలోని 13 గ్రామపంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఐవీఆర్ఎస్ సర్వే, పారిశుధ్య చర్యలు, ఇంటి పన్నుల వసూళ్లపై ఆమె సమీక్షించారు. మండలం అన్ని కార్యక్రమాల్లో అట్టడుగున ఉందని అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పారిశుధ్య నిర్వహణపై నిత్యం సమీక్ష నిర్వహిస్తుంటే గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరణ, సంపద తయారీ నిర్వహణలపై పట్టించుకోవటం లేదంటూ ఉద్యోగుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. రోజూ ఇంటింటికీ వెళ్లి పారిశుధ్య కార్మికుల ద్వారా తడి, పొడి చెత్త వేరు చేసి సంపద సృష్టి కేంద్రాలకు తరలించడం, వాటి రికార్డుల నిర్వహణ చేయనప్పుడు ఉద్యోగులుగా మీరేందుకు అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో ఒక్క గ్రామ పంచాయతీలో కూడా అప్ గ్రేడ్ కాకపోవడంపై ఆమె తీవ్రంగా మందలించారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేయకపోతే ఉద్యోగం వదిలేసి వెళ్లిపోవచ్చునని ఆమె మందలించారు. ఎంపీడీవో, ఈవోపీఆర్డీలు పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ, పీజీఆర్ఎస్ అర్జీలు, ఐవీఆర్ఎస్ సర్వేపై స్పందించరా? అని నిలదీశారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యలు మెరుగుపర్చి ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టిసారించాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోకి వెళ్లి ప్రజలను నేరుగా ఆమె పారిశుధ్య నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. పెదకళ్లేపల్లి సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపీటీసీ సభ్యురాలు అరజా ఆశాదేవి, డీఎల్పీవో సీతారామయ్య, ఈవోపీర్డీ కేటీ సుందరి, ఆయా గ్రామ కార్యదర్శులు ఉన్నారు.


పెదకళ్లేపల్లిలో సమీక్ష నిర్వహిస్తున్న డీపీవో అరుణ

టీడీపీని మరింత బలోపేతం చేయండి

పెడన, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పార్టీలోని అన్ని కమిటీలు సమర్థవంతంగా పనిచేసి టీడీపీని మరింత బలోపేతం చేయాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచించారు. తోటమూలలోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల, క్లస్టర్, యూనిట్, బూత్ కమిటీల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి కమిటీలు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. పార్టీలో బూత్ కమిటీల పాత్ర కీలకమైనదని, ఈ కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేస్తే రాబోయే పాతికేళ్ల పార్టీకి తిరుగుండదని నియోజకవర్గ పరిశీలకుడు గొట్టుముక్కల రఘురామరాజు అన్నారు. అర్జా వెంకట నగేష్, యక్కల శ్యామలయ్య, పోతన స్వామి, కూనపరెడ్డి వీరబాబు, వడుగు తులసీరావు, నాగిడి చెన్నకేశవరావు, బొర్రా కాశీ, గుజరాల్, కట్టా మునీశ్వరరావు, అంగర రంగనాథ్, నెక్కంటి భాస్కరరావు పాల్గొన్నారు.


పార్టీ కమిటీల ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించొద్దు

●మచిలీపట్నం, అవనిగడ్డ, పెడనలో వైసీపీ నిరసన

మచిలీపట్నం/అవనిగడ్డ/పెడన, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలంటూ బుధవారం మచిలీపట్నం, అవనిగడ్డ, పెడనలో వైసీపీ నాయకులు నిరసన ర్యాలీలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి వినతిపత్రాలు అందించారు. మచిలీపట్నంలో మాజీ ఎమ్మెల్యే పేర్నినాని, పేర్నికిట్టు, అవనిగడ్డలో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు, పెడనలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము, జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు భారీ నిరసన ర్యాలీలు చేశాయి.



పెడనలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

కార్తీకమాసంలో శివారాధనతో సత్ఫలితాలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో శివారాధనతో పాటు నారాయణసేవ వల్ల కోరిన కోర్కెలు తీరుతాయని ఆధ్యాత్మికవేత్త రాధామనోహరదాస్ అన్నారు. బచ్చుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థాన కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందని ఆయన తెలిపారు. ఆలయ ఆస్థాన పండితుడు ముక్తేవి శశికాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్రతాల్లో 170 మంది దంపతులు పాల్గొన్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ముక్తేవి రవికాంత్, ఆలయ ఈవో గోవాడ వెంకట కృష్ణారావు, రామలింగేశ్వరస్వామి ఆలయ ఈవో సమ్మెట ఆంజనేయస్వామి పాల్గొన్నారు.


అభిభాషణం చేస్తున్న ఆధ్యాత్మికవేత్త రాధామనోహర్ దాస్

మర్యాదపూర్వకంగా..

కోడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని పాలకాయితిప్ప అవుట్ ఫాల్ స్లూయిస్ రక్షణ గేట్ల నిర్మాణం, 22ఏ భూముల సమస్యలను లోకేశ్‌కు వివరించినట్లు బండే శ్రీనివాసరావు తెలిపారు.


మంత్రి నారా లోకేశ్‌తో టీడీపీ మండలాధ్యక్షుడు బండే శ్రీనివాసరావు

కుక్కకాటుకు చికిత్స పొందుతూ మహిళ మృతి

బంటుమిల్లి, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగేశ్వరరావుపేట గ్రామానికి చెందిన మార్గాని రమాదేవి కుక్కకాటుకు(59) మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. ఈనెల 4వ తేదీన రమాదేవిని కుక్క కరిచింది. చినపాండ్రాక ఆస్పత్రిలో మొదటి డోస్, 7వ తేదీన రెండవ డోస్ ఇంజక్షన్ తీసుకున్నారు. మూడవ డోస్ తీసుకోకుండానే మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ మృతి చెందారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ రమాదేవి మృతదేహానికి నివాళులు అర్పించి, రూ.10 వేలు సహాయం అందజేశారు.

పోక్సో కేసులో ఐదుగురికి రిమాండ్

మచిలీపట్నం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో నిందితుడికి, అతనికి సహకరించిన నలుగురికి కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది. టెంపుల్ కాలనీకి చెందిన బాలికను ప్రేమ పేరుతో వంచించి, లైంగిక సంబంధం కొనసాగిస్తున్న నిందితుడిని, అతడిని ప్రోత్సహించిన స్నేహితుడిని, స్నేహితుడి కుటుంబ సభ్యులు, నిందితుడి కుటుంబ సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. మరొకరు హైదరాబాద్‌లో ఉన్నారని, త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. ప్రధాన నిందితుడిని విజయవాడ జువైనల్ కోర్టులో, అతడికి సహకరించిన స్నేహితుడిని, నిందితుడి కుటుంబ సభ్యులు, స్నేహితుడి కుటుంబ సభ్యులను మచిలీపట్నం స్పెషల్ పోక్సో కోర్టులో హాజరుపరిచారు. బాలికలపై నేరాలకు పాల్పడితే కఠినంగా పరిగణిస్తామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు స్పష్టం చేశారు.

సస్పెన్స్ థ్రిల్లర్ సీమంతం

మచిలీపట్నం టౌన్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): సీమంతం సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమని హీరో వజ్రయోగి పేర్కొన్నారు. పీవీఆర్ మాల్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జింజేరుకు చెందిన తాను మచిలీపట్నం లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో విద్యనభ్యసించానన్నారు. హీరోయిన్ శ్రియాభారతి, కాకినాడ నాని, లింగంపల్లి అనిల్ తమ పాత్రలను చక్కగా పోషించారన్నారు. టీఆర్ డ్రీమ్ ప్రొడక్షన్స్‌లో నిర్మించిన ఈ సినిమాకు బందరుకు చెందిన గుడిసేవ గాయత్రి సౌమ్య సహాయ నిర్మాతగా వ్యవహరించారని దర్శకుడు సుధాకర్ తెలిపారు. ఈనెల 14న సిరివెంకట్ థియేటర్‌లో చిత్రం విడుదలవుతుందన్నారు.


మాట్లాడుతున్న సీమంతం చిత్ర హీరో వజ్రయోగి, హీరోయిన్ శ్రియాభారతి, దర్శకుడు సుధాకర్

ఢిల్లీ పేలుడు మృతులకు నివాళి

అవనిగడ్డ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో బాంబు పేలుళ్ల కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు సానుభూతిని తెలియజేస్తూ బుధవారం అవనిగడ్డ ప్రధాన సెంటర్‌లో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కూటమి నేతలు కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. దేశంలో అశాంతిని నెలకొల్పేందుకు పాకిస్థాన్ చేస్తున్న పలు కుట్రలు హేయమైనవని, భారత సైన్యాన్ని ధైర్యంగా ఎదుర్కొనే సత్తా లేక ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. జి.వి.నగరాయులు, బండే రాఘవ, అన్నపరెడ్డి వెంకటస్వామి, పరుచూరి దుర్గా ప్రసాద్, తుంగలగిరి, భోగాది చంద్రశేఖర్, ఘంటసాల రాజమోహనరావు, మెగావత్తు గోపి, మండలి రామ్మోహనరావు పాల్గొన్నారు.


అవనిగడ్డలో కొవ్వొత్తుల ప్రదర్శన చేస్తున్న కూటమి నేతలు


లబ్ధిదారులకు ఇంటి నమూనా తాళం అందిస్తున్న ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్

వేడుకగా గృహ ప్రవేశాలు

అవనిగడ్డ రూరల్, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ అన్నారు. బుధవారం పక్కా ఇళ్ల గృహ ప్రవేశాల వేడుక నియోజకవర్గ స్థాయిలో పులిగడ్డలో నిర్వహించారు. చెన్ను గణేష్ బాబు ఇంటిని వెంకట్రామ్, అధికారులు ప్రారంభించారు. నియోజకవర్గంలో 1236 పక్కా గృహాలు, మండలంలో 134 పక్కా గృహాల నిర్మాణం పూర్తయిందని తెలిపారు. ఎంపీడీవో మరియాదేవి, వైస్ ఎంపీపీ రేపల్లె పిచ్చేశ్వరరావు, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, హౌసింగ్ ఏఈలు తాడేపల్లి కార్తికేయ, ఆది ధర్మేశ్వరరావు, జి.సురేంద్ర, పంచాయతీ ఈవో అనిత, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సర్వర్ సమస్యలు లేకుండా ఆధార్ సేవలు

చల్లపల్లి, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇకపై ఆధార్ సేవలు సర్వర్ సమస్యలు లేకుండా వేగవంతంగా అందిస్తామని మచిలీపట్నం డివిజన్ పోస్టల్ జోన్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం చల్లపల్లి పోస్టాఫీసును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఖాతాదారులు, ప్రజలతో మాట్లాడి ఇక్కడి పోస్టాఫీసులో అందుతున్న సేవలపై అభిప్రాయాలను తెలుసుకున్నారు. కొన్ని ఆధార్ ఎంట్రీలను దగ్గరుండి పరిశీలించారు. రెండు రోజుల నుంచి ఆధార్ సేవలు అందించటంలో సర్వర్ సమస్యలు తలెత్తుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అందుకే ఆకస్మిక తనిఖీకి వచ్చానని తెలిపారు. సర్వర్ లోపాలు సరిచేశామన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

గూడూరు, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): ముక్కొల్లులో రూ. 8.75 లక్షల జడ్పీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను జడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు ప్రారంభించారు. వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నియోజకవర్గంపై పవన్‌కల్యాణ్ శ్రద్ధ పెడితే ఓర్వలేకపోతున్నారు

● వైసీపీ నేతలపై కూటమి నాయకుల విమర్శ

అవనిగడ్డ, నవంబరు 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధిపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి పెడితే వైసీపీ నేతలు చూసి ఓర్వలేక పోతున్నారని కూటమి నేతలు విమర్శించారు. బుధవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కార్యాలయంలో ఎంపీటీసీ సభ్యుడు బొప్పన భాను నేతృత్వంలో కూటమి నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. మొంథా తుఫాన్ అనంతరం నియోజకవర్గంలో పర్యటించిన పవన్ కల్యాణ్ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి నియోజకవర్గంలోని అపరిష్కృత సమస్యల కోసం రూ.100 కోట్ల మేర నిధులు వచ్చేలా ప్రకటన చేశారని, అవుట్ ఫాల్ స్లూయిస్ సమస్య, కరకట్టల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయని దీనిపై ఓర్వలేని వైసీపీ నేతలు నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. బచ్చు వెంకటనారాయణ, కటికల వసంత్, కనగాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

దివిసీమలో శాంతిస్థాపన కోసం పనిచేశా

● మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు

అవనిగడ్డ: 'రాజకీయాల్లోకి రాకమునుపే దివిసీమలో శాంతి స్థాపన కోసం ప్రయత్నించా. కక్షలు, కార్పణ్యాలతో రగిలిపోతున్న కోడూరు మండలం వేణుగోపాలపురం, నాగాయలంక మండలం సొర్లగొంది గ్రామాల్లో ప్రజలను సయోధ్య పర్చి రాజీ చేయించా. దివిసీమలో ఇప్పటి వరకు జరిగిన హింసాకాండ, హత్యలు ఎవరి హయాంలో జరిగాయో ప్రజలందరికీ తెలుసు.' అని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు అన్నారు. అవనిగడ్డలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోడూరు రహదారి నిర్మాణ పనులను వైసీపీ హయాంలో ప్రారంభించి దాదాపు సగానికి పైగా పూర్తి చేస్తే ఎన్నికల అనంతరం ఆ పనులను నిలుపుదల చేయించి 11 నెలల తర్వాత అదే కాంట్రాక్టర్‌తో రోడ్డు వేయించి ఆ పనిని తామే చేయించినట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రచారం చేయించుకుంటున్నారని సింహాద్రి అన్నారు. తన అరాచకంతోనే ఎదురుమొండి వారధి నిర్మాణం ఆగిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు.

రమేశ్‌బాబు విమర్శలపై స్పందించకండి

అవనిగడ్డ: దివిసీమ ప్రజలకు అన్నీ తెలుసని, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్‌బాబు తనపై చేస్తున్న విమర్శలపై కూటమి నేతలు ప్రతిస్పందించవద్దని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సామాజిక మాధ్యమాల్లో బహిరంగ ప్రకటన విడుదల చేశారు.